



అమలాపురంలో మంచుతెర



మామిడికుదురులో మంచుదుప్పటి

మంచు.. మసకేసిందిలే..

ప్రతి రోజూ ఉదయం సూరీడుని ఏం చూస్తారు.. నన్ను చూడండి అంటూ మంచుదుప్పటి కప్పేసింది.. పల్లెలు.. పట్టణాలను తన ఒడిలో దాచుకుంది.. శుక్రవారం ఉదయం పది గంటలైనా వెలుతురు కానరాలేదు.. ఇటువంటి వాతావరణం చూసి చాలాకాలం కాలం కావడంతో గోదావరి జిల్లాల్లో జనం పులకించిపోయారు.. ఉదయం వాహనాలపై వెళ్లేవారు మాత్రం కాస్త ఇబ్బందులకు గురయ్యారు.

6



కొబ్బరి.. అధరహో మరి!

- వెయ్యి కాయలు రూ. 16000
- రికార్డుస్థాయిలో కొబ్బరి ధరలు
- ఇతర రాష్ట్రాల్లో తగ్గిన ఉత్పత్తి
- ఉభయ జిల్లాల్లో పెరిగిన దిగుబడి
- కుంభమేళాకు కోనసీమ కొబ్బరి
- భారీగా సాగుతున్న ఎగుమతులు

కోనసీమ కొబ్బరికి ఈసారి డిమాండు పెరిగింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ధర పలికింది. కొబ్బరి పండించే రాష్ట్రాల్లో దిగుబడులు పడిపోవడంతో ఇక్కడి కొబ్బరికి ఒక్కసారిగా డిమాండు వచ్చింది. పైగా ఉత్తరప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న కుంభమేళాకు మన కొబ్బరి భారీగానే ఎగుమతి అయ్యింది.

6

మీతోనే!



సభ్యత్వంలోనూ చరిత్ర లిఖించెన్

- టీడీపీ వెంటే లక్షలాదిగా జనం
- సభ్యత్వ నమోదులో రికార్డు
- ఓటర్లు 45.16 లక్షలు
- టీడీపీ సభ్యులు 9.97 లక్షలు
- నియోజకవర్గానికి 50 వేలు
- గత రికార్డులు బద్దలు
- ఉత్సాహంగా టీడీపీ కేడర్
- ఉమ్మడి జిల్లాలో సైకిల్ జోరు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

సైకిల్ జోరు.. హుషారు.. తెలుగుదేశం పార్టీ సభ్యత్వాల నమోదులో ముందెన్నడూ లేని రీతిలో చరిత్ర సృష్టించింది. నియోజకవర్గాల వారీగా అత్యధిక పార్టీ సభ్యత్వాల నమోదును పూర్తిచేసింది. టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మంత్రి నారా లోకేశ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వాలను జోరుగా హుషారుగా చేపట్టి పూర్తి చేయడంతో పార్టీ వర్గాల్లో నూతనోత్తేజం నెలకొంది. గతంలో ఉన్న రికార్డులను సైతం బద్దలుకొట్టింది. ఉమ్మడి జిల్లా పరిధిలో ఉన్న తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ల్లోని 21 నియోజకవర్గాల్లో మొత్తం 45.16 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. వారిలో రికార్డు స్థాయిలో 9.97 లక్షల మంది తెలుగుదేశం పార్టీ సభ్యత్వం నమోదు చేయించుకున్నారు. టీడీపీ సభ్యత్వ నమోదులో ప్రవేశ పెట్టిన వినూత్న మార్పులు, ప్రమాద బీమా వంటి అంశాలపై ఈసారి ప్రజల్లోను, పార్టీ వర్గాల్లోను చైతన్యం పెరిగింది. దాంతో సభ్యత్వ నమోదులో గతం కంటే భిన్నంగా సభ్యులు మరింత ఉత్సాహంగా సభ్యత్వాలు నమోదు చేయించుకున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో అత్యధికంగా ఏడు నియోజకవర్గాలు కలిగిన తూర్పుగోదావరి జిల్లాలో 13.93 లక్షల మంది ఓటర్లు ఉండగా వారిలో 3.75 లక్షల మంది సభ్యత్వాలను పొంది ప్రథమస్థానంలో నిలిచారు. కోనసీమ జిల్లా ఏడు నియోజకవర్గాల పరిధిలో 15.12 లక్షల మంది ఓటర్లు ఉండగా 3.27 లక్షల మంది సభ్యత్వం నమోదు చేసుకుని ద్వితీయస్థానంలో ఉన్నారు. కాకినాడ జిల్లా ఏడు నియోజకవర్గాల్లో 16.10 లక్షల మంది ఓటర్లు ఉండగా 2.94 లక్షల మంది టీడీపీ సభ్యత్వం పొంది తృతీయ స్థానంలో నిలిచారు.

కోనసీమలో మండపేట టాప్..

కోనసీమ జిల్లా పరిధిలో అత్యధికంగా మండపేట నియోజకవర్గ పరిధిలో 2.16 లక్షల మంది ఓటర్లు ఉండగా వారిలో 57,765 మంది అత్యధికంగా టీడీపీ సభ్యత్వం తీసుకుని జిల్లాలో ప్రథమస్థానంలో నిలిచారు. అయితే ఇక్కడ టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిని నియమించకపోవడంతో పార్టీ సభ్యత్వ నమోదులో కొంచెం వెనుకబడ్డారు. ఇక కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రాతినిధ్యం వహించే రామచంద్రపురం నియోజకవర్గంలో లక్షా 99 వేల మంది ఓటర్లు ఉండగా వారిలో 57,442 మంది టీడీపీ సభ్యులుగా చేరి ద్వితీయస్థానం పొందారు. చివరి స్థానంలో రాజోలు రిజర్వుడు అసెంబ్లీ నియోజకవర్గం లక్షా 94 వేల మంది ఓటర్లు ఉండగా 22,414 మంది సభ్యత్వం తీసుకున్నారు. కొత్తపేట నియోజకవర్గంలో 2.49 లక్షల మంది ఓటర్లు ఉండగా వారిలో 56,520 మంది, అమలాపురం రిజర్వుడు నియోజకవర్గంలో 2.11 లక్షల మంది ఓటర్లు ఉండగా వారిలో 52,509 మంది, ముమ్మిడివరం నియోజకవర్గంలో 2.42 లక్షల మంది ఓటర్లు ఉండగా వారిలో 45,674 మంది, పి.గన్నవరం నియోజకవర్గంలో లక్షా 96 వేల మంది ఓటర్లు ఉండగా 34,843 మంది టీడీపీ సభ్యులుగా సభ్యత్వం పొందారు.

కాకినాడ జిల్లాలో ఇలా..

కాకినాడ రూరల్ నియోజకవర్గంలో అత్యధికంగా 53,915 మంది టీడీపీ సభ్యత్వం తీసుకున్నారు. కాకినాడ సిటీ 46,194, తుని 44,592, ప్రత్తిపాడు 43,370, పెద్దాపురం 40,655, జగ్గంపేట 34,681, పిఠాపురం 31,375 మంది టీడీపీ సభ్యత్వం తీసుకున్నారు. పిఠాపురం నియోజకవర్గం నుంచి జనసేన అధినేత పవన్‌కల్యాణ్ డిప్యూటీ సీఎం హోదాలో కొనసాగుతున్నారు.

తూర్పున... 'గోపాలపురం'

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

తూర్పుగోదావరి జిల్లాలో టీడీపీ బలం పెరిగింది. పార్టీ సభ్యత్వ నమోదు రికార్డు స్థాయిలో జరిగింది. గోపాలపురం ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గం లక్ష్యాన్ని మించి రికార్డు సాధించింది. జిల్లాలో మొత్తం 4.30 లక్షల మందిని చేర్పించాలని లక్ష్యం కాగా మొత్తం 3 లక్షల 62 వేల 634 మంది సభ్యులుగా చేరారు. రెన్యువల్ చేయించుకున్న వారు 1,44,773 మంది, కొత్తవాళ్లు 2,17,861 మంది ఉన్నారు. గోపాలపురం నియోజకవర్గంలో 60 వేలు సభ్యత్వ నమోదు లక్ష్యం కాగా మరో 4,375 అదనంగా చేసి ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు 107.29 శాతం సాధించారు. రెండో స్థానంలో అనపర్తి నిలిచింది. లక్ష్యం 55 వేలు కాగా 52,787 మంది 95.98 శాతం సభ్యులుగా చేరారు. ఇక్కడ బీజేపీ ఎమ్మెల్యేగా నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఉన్న సంగతి తెలిసిందే. ఆయన కుమారుడు ఎస్.మనోజ్‌రెడ్డి టీడీపీ ఇన్‌చార్జిగా ఉన్నారు. కొవ్వూరు మూడో స్థానంలో నిలిచింది. 60 వేల సభ్యత్వం లక్ష్యం కాగా 51,851 అంటే 86.42 శాతం మందిని చేర్పించారు. ఎమ్మెల్యే ముప్పిడి వేంకటేశ్వరరావు, పారిశ్రామికవేత్త పెండ్యాల అచ్చిబాబు, ద్విసభ్య కమిటీ సభ్యులు సభ్యత్వ నమోదుపై దృష్టి సారించారు. రాజానగరంలో 79.67 శాతం జరిగింది. రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు జరిగింది. లక్ష్యం 55 వేలు కాగా 43,820 మందిని చేర్పించారు. నిడదవోలులో 78.33 శాతం జరిగింది. లక్ష్యం 55 వేలు కాగా మాజీ ఎమ్మెల్యే శేషారావు 43,079 మందిని చేర్పించారు. రాజమహేంద్రవరం రూరల్‌లో 75 వేలు లక్ష్యం కాగా 55,485 మందిని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఆధ్వర్యంలో చేర్పించారు. రాజమహేంద్రవరం సిటీలో 70 వేల సభ్యత్వాలు లక్ష్యం కాగా 51,237 మందిని చేర్పించారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డివాసు ఆధ్వర్యంలో 73.98 శాతం సభ్యత్వ నమోదు జరిగింది.

పని ఒత్తిడిని అధిగమించేందుకు జీవనశైలి మార్చుకోవాలి : జేసీ



రెవెన్యూ ఉద్యోగుల సమావేశంలో మాట్లాడుతున్న జేసీ నిషాంతి

అమలాపురం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): నిత్యం పని ఒత్తిడితో గడిపే రెవెన్యూ ఉద్యోగులు వ్యాయామంతోపాటు జీవనశైలిలో మార్పులు చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి సూచించారు. ఆహారపు అలవాట్లలో మార్పులు తప్పనిసరి కావాలన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం రెవెన్యూ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. విధి నిర్వహణలో సమస్యలు, పనిఒత్తిడి, ఆరోగ్య భద్రత, జీవనశైలి అంశాలపై వారితో చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యోగులు విధులు, బాధ్యతల నిర్వహణతోపాటు ఆరోగ్య పరిరక్షణపై దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు సైతం ఇతర వర్గాల వారి మాదిరిగానే అనేక రకాల ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. వీటిలో మధుమేహం, అధిక రక్తపోటు, మానసిక ఆరోగ్య సమస్యలు ముఖ్యమైనవిగా గుర్తించామన్నారు. ఆధునిక సమాజంలో జంక్ ఫుడ్‌లు తినడం వల్ల ఆరోగ్య భద్రతకు ముప్పు వాటిల్లుతుందన్నారు. ఉద్యోగులు శారీరక, మానసిక, సామాజిక కుటుంబ సంక్షేమాన్ని పరిగణలోనికి తీసుకోవడం ద్వారా మరింత ఉత్సాహంగా విధులు నిర్వహించేందుకు అవకాశం ఉందన్నారు. రాష్ట్రాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తూ ప్రజలకు సేవచేసే ఉద్యోగులు సమయపాలన పాటిస్తూ జవాబుదారీతో పని చేస్తూ ఉన్నత స్థాయి అధికారుల మన్ననలు పొందాలన్నారు. ఉద్యోగులు ఆరోగ్యాన్ని పర్యవేక్షించుకోవడానికి క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. డీఆర్వో బీఎల్ఎన్ రాజకుమారి మాట్లాడుతూ రెవెన్యూ ఉద్యోగులు రీసర్వే, ఇతర పనులు నిర్వహిస్తూ ఎంతో పని ఒత్తిడికి గురవుతున్నారని గుర్తించామన్నారు. పని ఒత్తిడిని అధిగమించేందుకు రోజువారీ కొంత సమయాన్ని ఆరోగ్య భద్రతకు కేటాయిస్తూ వ్యాయామం, యోగా వంటి కార్యక్రమాలు తప్పనిసరిగా చేపట్టాలన్నారు. రెవెన్యూ ఉద్యోగుల ఆరోగ్యం పట్ల జాయింట్ కలెక్టర్ శ్రద్ధ తీసుకోవడం అభినందనీయమన్నారు. ఉద్యోగులు ఇబ్బందులను ఉన్నతస్థాయి అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కార మార్గాలు పొందాలన్నారు. సమావేశంలో కలెక్టరేట్ పరిపాలనాధికారి కడలి కాశీవిశ్వేశ్వరరావు, కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ మురళీకృష్ణ, ఉప తహశీల్దార్ చినబాబు పాల్గొన్నారు.



మర్యాద పూర్వకంగా..

అమలాపురం టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ పథక సంచాలకురాలుగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన బి.శాంతకుమారి.. కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. విజయనగరం జిల్లాలో మహిళా శిశుసంక్షేమశాఖ సహాయ పథక సంచాలకురాలిగా పనిచేస్తూ పదోన్నతిపై శాంతకుమారి కోనసీమ జిల్లాకు నియమితులయ్యారు.



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్

పండుగలా గణతంత్ర వేడుకలు

అధికారులతో జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ సమీక్ష

అమలాపురం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): 76వ గణతంత్ర దినోత్సవాన్ని పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ జిల్లాస్థాయి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం గణతంత్ర వేడుకల సన్నద్ధతపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈనెల 26న అమలాపురం జీఎంసీ బాలయోగి స్టేడియంలో గణతంత్ర వేడుకలను నిర్వహిస్తామన్నారు. జిల్లాస్థాయి అధికారులకు కేటాయించిన విధులను బాధ్యతతో పూర్తిచేయాలన్నారు. ప్రతీ అంశంలో సమయపాలన పాటిస్తూ ఈవెంట్లను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఉదయం 9 గంటలకు స్టేడియంలో త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించడంతో వేడుకలు ప్రారంభం కావాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి ఆయా కార్యక్రమాలను పూర్తిగా పర్యవేక్షిస్తారన్నారు. వేడుకల నిర్వహణపై ఎవరికైనా సందేహాలు ఉంటే ఆమె నివృత్తి చేస్తారన్నారు. ఇప్పటికే శాఖల వారీగా విధులు, బాధ్యతలు అప్పగించామన్నారు. జీరో పేదరిక నిర్మూలన ఇతివృత్తంపై జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, జిల్లా గృహ నిర్మాణ సంస్థ, జిల్లా ముఖ్య ప్రణాళికా విభాగం అధికారులు ఒక శకటాన్ని మూడు విభాగాల సంక్షేమ కార్యక్రమాలు ప్రతిబింబించేలా రూపొందించాలన్నారు. జిల్లా పరిశ్రమల కేంద్రం, ఉద్యానశాఖ సంయుక్తంగా ఉపాధి ఉద్యోగ అవకాశాల కల్పన ఇతివృత్తంపై ఒక శకటాన్ని, సంక్షేమ కార్యక్రమాలకు అద్దంపట్టేలా ఉండాలన్నారు. చేనేత జౌళిశాఖ, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్తంగా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు, జీవనోపాధి పెంపుదల ఇతివృత్తంపై సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ శకటాన్ని రూపొందించాలన్నారు. మున్సిపల్ కమిషనర్లు స్వచ్ఛాంధ్ర, అన్న క్యాంటీన్ల ఇతివృత్తంగా ఒక శకటాన్ని, ట్రాన్స్‌కో విభాగం, ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంపై ఒక శకటాన్ని, జిల్లా మత్స్యశాఖ, దేవదాయ, ధర్మాదాయ, వైద్య ఆరోగ్యశాఖ ఒక్కో శకటాన్ని సిద్ధం చేయాలన్నారు. పల్లె పండుగ ఇతివృత్తంపై జిల్లా నీటియాజమాన్య సంస్థ రూపొందించే శకటంతో మొత్తం 9 శకటాలను ప్రదర్శనలో ఉంచాలన్నారు. శకటాల ప్రదర్శనలో స్వర్ణాంధ్ర విజన్-2047 పది ప్రాధాన్యతా అంశాలు ప్రతిబింబించేటట్టు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ జరగాలన్నారు. క్రమబద్ధంగా ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందించే ఏర్పాట్లు ఆయా జిల్లా శాఖల అధికారులు తీసుకోవాలని కలెక్టర్ దిశా, నిర్దేశం చేశారు. జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, ఆర్డీవో కె.మాధవి, వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఎస్.యానాం పీహెచ్‌సీలో

సీఎస్ఆర్ మందుల రగడ

- మందులు ఇవ్వడం లేదంటూ రోగుల ఆగ్రహం
- ఆరు నెలలుగా సరఫరా లేదంటున్న వైద్యాధికారులు
- డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలోనే జాప్యం
- మరమ్మతులతో విశ్రాంతి తీసుకుంటున్న అంబులెన్స్

ఉప్పలగుప్తం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడు పీహెచ్‌సీల్లో ఎస్.యానాం పీహెచ్‌సీకి ఒక ప్రత్యేకత ఉంది. ఇద్దరు ప్రభుత్వ వైద్యులతోపాటు స్థానిక రవ్వ ప్లాంటు ఆధ్వర్యంలో మరో ఇద్దరు వైద్యులు, కొంత మంది సిబ్బంది ఇక్కడ ఉన్నారు. ప్రభుత్వం ఇచ్చే మందులతోపాటు ప్రైవేటుగా మందులు కొని రోగులకు ఇస్తారు. ఒక అంబులెన్స్ కూడా ఏర్పాటుచేశారు. వైద్యులు, సిబ్బంది, మందులు కొనుగోలు, అంబులెన్స్ నిర్వహణకు ప్లాంటు సీఎస్ఆర్ నిధులు ఖర్చు చేస్తారు. ఏడాదికి ఒకేసారి బడ్జెట్ ప్రకారం నిధుల్ని రవ్వ యాజమాన్యం జిల్లా కలెక్టర్‌కు సమర్పిస్తుంది. జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయానికి కలెక్టర్ కార్యాలయం ద్వారా నిధులు చేరతాయి. ఈ క్రమంలోనే ఏటా కార్యకలాపాలు జరగడం సర్వసాధారణం. అయితే ఆరు నెలలుగా తమకు సీఎస్ఆర్ మందులు ఇవ్వడం లేదంటూ రోగులు ఆసుపత్రి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. మందులు దాచేసుకుంటున్నారంటూ విరుచుకుపడుతున్నారు. ఇదే పరిస్థితి గతంలోనూ ఒకసారి ఏర్పడింది. అప్పట్లో 'ఆంధ్రజ్యోతి' వార్తా కథనంతో సమస్య పరిష్కారానికి అధికారులు చొరవ తీసుకున్నారు. మళ్లీ ఇప్పుడు అదే పరిస్థితి పునరావృత్తమైంది. మరి ఈ పరిస్థితికి కారణం ఏమిటన్నది వైద్యాధికారులకే తప్ప రోగులకు తెలియదు. ప్రతి మూడు నెలలకు అవసరమైన మందుల జాబితాను పీహెచ్‌సీ అధికారులు డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయానికి పంపిస్తారు. మందుల కొనుగోలు అనంతరం జిల్లా కార్యాలయం నుంచే పీహెచ్‌సీకి సరఫరా అవుతాయి. ఈసారి మాత్రం గత ఏడాది ఆగస్టు నుంచి ఇప్పటివరకు సీఎస్ఆర్ మందుల సరఫరా లేదని ఆసుపత్రి వైద్యాధికారి తెలిపారు. గత ఏడాది అక్టోబరులో నాలుగు రకాల అత్యవసర మందులు మాత్రమే అందాయన్నారు. దాంతో రోగులకు వైద్యులు సమాధానం చెప్పలేకపోతున్నారు. జాప్యం ఎందుకు జరుగుతోందన్నది ఆరా తీసేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది జనాగ్రహాన్ని చవిచూస్తున్నారు. దీనిపై డీఎంఅండ్‌హెచ్‌వో ఎం.దుర్గారావుదొరను వివరణ కోరగా జాప్యం తమ కార్యాలయంలోనే జరిగిందన్నారు. సంబంధిత సెక్షన్ ఉద్యోగి లేకపోవడమే కారణమన్నారు. వారంలో మందులు పంపిస్తామన్నారు. అంబులెన్స్ మూలనపడడంతో అత్యవసర కేసులు వస్తే ఏమి చేయాలో తెలియని స్థితి. అంబులెన్స్‌పై తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



ఎస్.యానాం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం



విశ్రాంతి తీసుకుంటున్న అంబులెన్స్

వీర్వోలకు షోకాజ్ నోటీసులు

పి.గన్నవరం,జనవరి24(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాను నిలుపదల చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఏడు గ్రామాల వీఆర్వోలకు తహశీల్దార్ పి.శ్రీపల్లవి షోకాజ్ నోటీసులను అందించారు. పి.గన్నవరం, ఎల్.గన్నవరం, మానేపల్లి, మొండెపులంక, బెల్లంపూడి, ఉడిమూడి, గంటిపెదపూడి గ్రామాల వీఆర్వోలకు షోకాజ్ నోటీసులు అందించామని, వారు సంజాయిషీ ఇవ్వాల్సి ఉందని నోటీసులో పేర్కొన్నారు. నోటీసులు తీసుకున్న వీఆర్వోలు 24 గంటల్లో తహశీల్దార్ వద్ద హాజరై లిఖితపూర్వకంగా సంజాయిషీలు ఇవ్వాలని కోరారు.

ఉత్సాహంగా బాలికా దినోత్సవం

అమలాపురం టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా జిల్లావ్యాప్తంగా వేడుకలు జరిపారు. అనేక ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. బాలికా చైతన్యాన్ని గుర్తుచేసే ఆకృతుల్లో విద్యార్థినులు ఒదిగి కూర్చుని అవగాహన కల్పించారు. కొన్నిచోట్ల బాలికా విద్యపై అవగాహన కల్పించే కార్యక్రమాలను సైతం నిర్వహించారు. కాగా అమలాపురం విద్యానిధి విద్యాసంస్థల ప్రాంగణంలో శుక్రవారం జాతీయ బాలికా దినోత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. విద్యా సంస్థల చైర్మన్ ఏబీ నాయుడు ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. బాలికల హక్కులు వివరించడంతోపాటు విద్యతో అనుకున్న లక్ష్యాలను సాధించాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని వివరించారు. బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎ.శ్యామలామహలక్ష్మి, ప్రిన్సిపాల్ టి.నాగమాధవి, వైస్ ప్రిన్సిపాల్ ఆంటోనీ, చిత్రకళ ఉపాధ్యాయుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.



అమలాపురంలోని విద్యానిధిలో జరిగిన బాలికా దినోత్సవ కార్యక్రమంలో విద్యార్థినుల ప్రదర్శన

కొబ్బరి.. అధరహో మరి!



పంట పండింది



ఎందుకీ పంట.. ఆ చెట్టు నేను చూడడం.. నా వంక ఆ చెట్టు చూడడం తప్ప లాభం లేదు.. కనీసం నిమ్మకాయలతో కూడా పోటీపడలేక పోతోంది.. ఇదీ నిన్నటి వరకూ కొబ్బరి రైతు ఆవేదన.. ఎందుకంటే నిన్నమొన్నటి వరకూ కొబ్బరికాయ రూ. 10లు దాటిన ఘటనలు లేవు.. అటువంటిది ఒక్కసారిగా రూ.20లు మేర పెరిగిపోయింది.. అంటే వెయ్యి కాయలు రూ.20 వేలు అనమాట.. దీంతో కొబ్బరి పంట పండిందని .. రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు..

- వెయ్యి కాయలు రూ. 16000
- రికార్డుస్థాయిలో కొబ్బరి ధరలు
- ఇతర రాష్ట్రాల్లో తగ్గిన దిగుబడి
- ఉభయ జిల్లాల్లో పెరిగిన దిగుబడి
- కుంభమేళాకు కోనసీమ కొబ్బరి
- భారీగా సాగుతున్న ఎగుమతులు

గండేరా వెయ్యి కాయలు రూ.20 వేలు

పచ్చికొబ్బరికాయలు వెయ్యింటికి రూ.16వేలు, కొత్తకాయలో కురిడీలు వెయ్యింటికి గండేరా రకం రూ.19 వేలు, గటగట రకం రూ.16వేలు పలుకుతుంది. కురిడీ కొబ్బరి మార్కెట్‌లో గండేరా రకం వెయ్యికాయలకు రూ.20వేలు పలుకుతుంది. గతంలో ఎన్నడులేదని కొబ్బరిధరలు కొనసాగుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు.

అంబాజీపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : కోనసీమ కొబ్బరి మార్కెట్‌కు మంచిరోజులు వచ్చాయి.. ఇప్పటి వరకూ పడుతూ లేస్తూ ఉన్న కొబ్బరి ధర అమాంతం పెరిగిపోయింది. అలా ఇలా కాదు.. గతంలో ఎన్నడూ లేని విధంగా రికార్డుస్థాయిలో ధరలు ఉండడంతో ఇటు రైతులు, అటు వ్యాపారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కొబ్బరి పండించే తమిళనాడు, కర్ణాటక, కేరళ వంటి రాష్ట్రాల్లో కొబ్బరి దిగుబడి తగ్గడంతో మన రాష్ట్రంలో కొబ్బరికి డిమాండ్ వచ్చింది.ఈ నేపథ్యంలో కొబ్బరి ధరలు ఊహించని రీతిలో పెరిగాయి.ఎగుమతులు ఊపందుకున్నాయి.ఇతర రాష్ట్రాల్లో కొబ్బరి దిగుబడులు తగ్గాయి.మన రాష్ట్రంలో కొబ్బరి దిగుబడులు పెరగడంతో మార్కెట్ ఊపందుకుంది.

కొబ్బరి రైతులకు తీపి కబురు..

గతంలో ఎకరా కొబ్బరితోటకు 300 నుంచి 400 కొబ్బరికాయలు మాత్రమే దిగుబడి వస్తే ప్రస్తుతం ఎకరాకు 700కు పైగా దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. దీంతో పచ్చికాయకు డిమాండ్ ఏర్పడింది. పాతముక్కుడు కాయను బీహార్, ఒడిషా వంటి రాష్ట్రాలకు భారీగా ఎగుమతులు అవుతున్నాయి.పచ్చికాయ వెయ్యింటికి రూ.15,500 నుంచి రూ.16 వేలు ఉండగా పాతకాయ వెయ్యింటికి రూ.16 వేల నుంచి రూ.16,500 వరకు ధర పలుకుతుంది. అదే గతేడాది సంక్రాంతికి రూ.9 వేలు ఉండగా ప్రస్తుతం ధర పెరుగుదలతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మహాశివరాత్రి సందర్భంగా ఆయా రాష్ట్రాలకు రోజు 40కు పైగా లారీలు ఎగుమతులు అవుతున్నట్టు వ్యాపారులు చెబుతున్నారు.మహారాష్ట్ర, రాజస్థాన్, మధ్యప్రదేశ్,చత్తీస్‌గఢ్,తెలంగాణ రాష్ట్రాలకు ఎగుమతులు జరుగుతున్నాయి.



కుంభమేళాకు కోనసీమ కొబ్బరి



ఉభయగోదావరి జిల్లాల నుంచి 100 నుంచి 120 లారీల వరకు కొబ్బరి ఎగుమతులు జరుగుతున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి ఆర్డర్లు అధికంగా రావడంతో మరింత పెరిగే అవకాశాలు ఉన్నట్టు చెబుతున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ కేంద్రంగా జరుగుతున్న మహాకుంభమేళాకు కోనసీమ ప్రాంతం నుంచి కొబ్బరి ఎగుమతులు జరుగుతున్నాయి. కుంభమేళాకు వచ్చే భక్తులు నదీమాతకు కురిడీ కొబ్బరిని వినియోగిస్తున్న నేపథ్యంలో కురిడీ కొబ్బరికి డిమాండ్ ఏర్పడింది. సంక్రాంతి సీజన్ ముగియడంతో పాటు రానున్న మహాశివరాత్రి, శ్రీపంచమి, హోలీ, పెళ్ళిళ్ల సీజన్‌తో కొబ్బరిమార్కెట్‌లో ధరలు మరింత పెరిగే అవకాశాలున్నాయని వ్యాపార విశ్లేషకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం అటకలపై కొబ్బరి కాయ నిల్వ లేదని , డిమాండ్ తగినంతగా సరఫరా ఉండకపోవచ్చునని వ్యాపారులు వాపోతున్నారు.

మంచు.. ముసుగేసింది..

ఎక్కడ ఉన్నాం.. ఎటెల్లిపోతున్నాం.. ఊటీలో ఉన్నామా..కొడైకెనాల్‌లో ఉన్నామా.. లేదంటే లంబసింగి వచ్చేశామా.. అన్నట్టు మంచు ముసుగేసింది.. శుక్రవారం ఉదయం 8 గంటలు దాటినా తెలవారలేదు.. సూరీడు బయటకు రాలేదు.. సూరీడు ఎక్కడా అని వెతుక్కోవాల్సి వచ్చింది.. కాసేపటికి కలలా మంచు కరిగిపోయింది.. అప్పుడు తెలిసింది.. మనం గోదావరి జిల్లాలోనే ఉన్నామని.. ఎందుకంటే శుక్రవారం రోడ్లు కూడా కనిపించనంతగా మంచు ముసుగేసింది.. కోనసీమ జిల్లా అంబాజీపేట, మామిడికుదురు, యానాం, అమలాపురం, మండపేట , తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు, చాగల్లు, కాకినాడ జిల్లా తొండంగి, ముమ్మడివరం మండలాల్లో ఇలా మంచు ముసుగేసింది.



అమలాపురంలో..



మండపేట - తాపేశ్వరం రహదారిలో

ప్రకృతి గీసిన చిత్రం : యానాంలో గోదావరిపై కప్పేసిన పొగమంచు



దారినీ వదల : ఉదయం 8 గంటలకు యానాంలో జాతీయ రహదారిపై ఇలా



దారేది: కాకినాడ నగరంలో ఉదయం పూట కురుస్తున్న మంచు




అమలాపురం/మండపేట/మామిడికుదురు/యానాం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): తెలతెల్లవారే వేళ.. పచ్చని అందాలతో చూపరులను మంత్రముగ్ధులను చేసే తూర్పు గోదావరి జిల్లా మంచుపరదాల్లో మరిన్ని సొబగులు అద్దుకుంది. మంచు తెరల మాటున పల్లెలు కొత్త అందాలను సంతరించుకున్నాయి. శుక్రవారం ఉదయం 9 గంటల తరువాత కూడా మంచు తెరలు తొలగలేదు. దీంతో వాహనాలకు లైట్లు వేసుకుని వెళ్లాల్సి వచ్చింది. విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు ఇబ్బందులు పడ్డారు. శీతాకాలం వచ్చిన తరువాత తొలిసారిగా శుక్రవారం మంచు తెరలు జిల్లాను కమ్మేశాయి. ముందెన్నడూలేని రీతిలో మంచు అనూహ్యంగా కురవడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మరికొంత మంది మంచు దృశ్యాలను తమ సెల్‌ఫోన్లలో బంధించేందుకు ఆసక్తి కనబరిచారు. మార్నింగ్ వాకింగ్ చేసేవారు ఆహ్లాదకరమైన వాతావరాన్ని ఆస్వాదిస్తు పొగమంచులో సెల్ఫీలు దిగారు. చాలా మంది మంచును ఆస్వాదించారు.. చాలా కాలం తరువాత మంచు ఇంత దట్టంగా కప్పేసిందని. ఇలా చాలా కాలమైందని గత జ్ఞాపకాల్లోకి వెళ్లారు.



మండపేటలో ఇలా..

తప్పని ఇక్కట్లు

ఉదయం 10 గంటల వరకు మంచు కమ్మేయడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఉష్ణోగ్రతలు కూడా బాగా తగ్గి 18 నుంచి 26 డిగ్రీల వరకు నమోదయ్యాయి. మంచుతో పాటు చలితీవ్రత పెరిగిపోవడంతో అందరూ మంకీ క్యాప్‌లు, జెర్కిన్లు, శాలువాలు ఉపయోగించాల్సిన పరిస్థితి నెలకొంది. వాతావరణం ఒక్కసారిగా మారిపోవడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. ముందు రోజు రాత్రి నుంచే చలి తీవ్రత బాగా పెరిగింది. ఉదయం నుంచి కోనసీమ ప్రాంతాన్ని మంచు దుప్పటి కప్పేసింది. గత రెండు నెలలతో పోలిస్తే శుక్రవారం కురిసిన మంచు చాలా ఎక్కువ అని నిపుణులు చెబుతున్నారు. ఈ మంచు బారిన పడితే అనారోగ్యాలకు గురి అవుతారని ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. మంచు తీవ్ర స్థాయిలో కురవడం వల్ల వ్యవసాయ పంటలతో పాటు ఆక్వారంగానికి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. నీటిలో ఉష్ణోగ్రతలు పడిపోవడం వల్ల ఇబ్బందులు తలెత్తుతాయని వారి ఆందోళన. యానాం నియోజకవర్గాన్ని పొగమంచు కమ్మేసింది. పొగమంచు వల్ల వాహనదారులు ఇబ్బం దులకు గురయ్యారు.



మామిడికుదురులో కప్పేసిన మంచు

ఎన్నాళ్లకెన్నాళ్లకు: మామిడికుదురు గ్రామంలో దారిని కప్పేసిన మంచు



మంచు తెరల మధ్య మహాదేవుడు

మంచు తెరల మధ్య మహదేవుడి విగ్రహం భక్తులకు మహదానందాన్ని కలిగించింది, శుక్రవారం ఉదయం 9 గంటల వరకూ విపరీతమైన మంచుకురిసింది.ఏ కొత్తపల్లి కదంబ క్షేత్రంలో ఉన్న భువనేశ్వరి సహిత విజయేశ్వరుడి ఆలయంతో పాటు అక్కడి కోనేరులో కొలువైన మహదేవుడి విగ్రహం మంచు తెరల మధ్య నయనానందాన్ని కలిగించింది. **- తొండంగి**





చుండ్రు గోవిందరాజు

జాతీయ క్రీడలకు రాష్ట్ర ఒలింపిక్ సంఘ కార్యదర్శిగా గోవిందరాజుకు ఆహ్వానం

- 60 ఏళ్ల క్రీడా ప్రస్థానం

కాకినాడఅర్బన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడకు చెందిన వెటరన్ క్రీడాకారుడు, ఒలింపిక్ సంఘ రాష్ట్ర కార్యదర్శి చుండ్రు గోవిందరాజుకు అరుదైన అవకాశం దక్కింది. ఈనెల 27నుంచి ఫిబ్రవరి 14 వరకు ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని డెహ్రాడూన్‌లో జరిగే జాతీయ క్రీడల్లో ఒలింపిక్ సంఘ రాష్ట్ర సీఈవో హోదాలో పాల్గొనేందుకు ఆహ్వానం అందింది. దీనికి సంబంధించిన వివరాలను శుక్రవారం మీడియాకు తెలిపారు మండపేటలో జన్మించిన ఆయన 50 ఏళ్లుగా కాకినాడలో నివసిస్తున్నారు. తన 16వ ఏట నుంచి క్రీడా జీవితాన్ని ప్రారంభించిన ఆయన 1969-70లో తొలిసారి ఆంధ్రా యూనివర్సిటీ తరపున ఇంటర్ యూనివర్సిటీ ఖోఖో పోటీల్లో పాల్గొని పతకాలు సాధించారు. 30 ఏళ్లుగా బ్యాడ్మింటన్ క్రీడాకారుడిగా 10 జాతీయ, ఒక అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని వివిధ పతకాలు సాధించారు. ఒలింపిక్ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, సీఈవోగా జాతీయ క్రీడలకు ఈనెల 25న బయలుదేరి వెళుతున్న గోవిందరాజును ఒలింపిక్ సంఘ జిల్లా అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, కార్యదర్శి ఎలీషాబాబు, డీఎస్‌డీవో బి.శ్రీనివాసకుమార్, మాస్టర్స్ అథ్లెటిక్స్ జిల్లా అధ్యక్షుడు బి.కృష్ణమూర్తి అభినందించారు.

సత్రం గదుల కేటాయింపులో నిబంధనలు పాటించాలి: ఈవో

అన్నవరం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధికి విచ్చేసే భక్తులకు సత్రంగదుల కేటాయింపులో నిబంధనలు తప్పనిసరిగా పాటించేవిధంగా చర్యలు తీసుకోవాలని ఈవో సర్క్యులర్ జారీచేశారు. సత్రంగదులవద్ద పనిచేసే సిబ్బంది డ్రెస్‌కోడ్, గుర్తింపుకార్డు తప్పనిసరిగా ధరించాలని సూచించారు. దళారీవ్యవస్థ అధికంగా ఉన్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని జాగ్రత్తగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే ఉద్యోగులపై చర్యలుతప్పవని హెచ్చరించారు.

నాటక రంగాన్ని బతికించుకోవాలి

- ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు
- ఉభయ తెలుగు రాష్ట్రాల నాటికల పోటీలు ప్రారంభం



రాష్ట్రస్థాయి నాటిక పోటీలను ప్రారంభిస్తున్న ముప్పన వీర్రాజు, ప్రముఖ వైద్యుడు లక్ష్మీనారాయణ

పెద్దాపురం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): నాటక రంగాన్ని బతికించుకోవాల్సిన అవసరం నేటి సమాజంపై ఎంతైనా ఉందని ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు, ప్రముఖ వైద్యుడు ఇంధన లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని చంద్రమాంపల్లి గ్రామంలో స్నేహ ఆర్ట్స్ నాటక పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉభయ తెలుగు రాష్ట్రాల రాష్ట్రస్థాయి ఆహ్వాన నాటికల పోటీలను వారు శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. మంచి సమాజాన్ని నిర్మించుకోవడానికి కళలు, నాటకాలు ఎంతో దోహదపడతాయన్నారు. నాటకం జీవితాన్ని ప్రతిభింబిస్తే, జీవితాన్ని నాటకంగా మన ముందు ఉంచుతుందన్నారు. మానవతా విలువలకు ప్రతిరూపమే నాటకాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో జీవన విధానాలను, సామాజిక సంబంధాలను నాటకాలు, కళారూపాల ద్వారా వ్యక్తపరిచాయన్నారు. నాటక పరిషత్‌ను క్రమం తప్పకుండా నిర్వహించాలని వారు నిర్వాహకులను కోరారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు కొత్తిం వెంకట శ్రీనివాసరావు (కోటి), గోపు నారాయణ మూర్తి, స్నేహ ఆర్ట్స్ అధ్యక్షుడు గొందేసి రాజా, ఇంధన బ్రహ్మానందం, కొత్తిం స్వామినాథన్ దేవాడ పాపేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఖరీదైన జైళ్లు నాటిక

కాళ్లు, చేతులు, కళ్లు, నోరు ఇలా అవయవాలే కాదు, అవి జంతువులకు కూడా ఉంటాయని. జంతువుల నుంచి మనిషిని వేరు చేసేది మనసు మాత్రమే అని, అది దేవుడు మనిషికి మాత్రమే ఇచ్చాడన్న ఇతివృత్తంతో సాగే ఖరీదైన జైళ్లు నాటిక ద్వారా కళ్లకు కట్టినట్లు చూపించారు ఈ నాటికను చైతన్య కళాభారతి (కరీంనగర్)వారు ప్రదర్శించ గా, మూలకథను పి.వెంకటేశ్వరరావు రచన చేశారు.

మంచి సందేశాన్నిచ్చిన అనూహ్యం నాటిక

తల్లిదండ్రుల వారసత్వ సంపదను, కష్టార్జితాన్ని కన్న కొడుకులు హక్కుల పేరుతో కుటిల నీతితో వ్యూహాత్మకంగా దక్కించుకోవాలని చూస్తున్నారని, కష్టపడి అభివృద్ధి చెందాల్సిన కొందరు కన్నబిడ్డలు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారన్న ఇతివృత్తంతో ప్రదర్శించిన అనూహ్యం నాటిక ఆహుతులను ఆకట్టుకుంది. తాళాబత్తుల వెంకటేశ్వరరావు రచనచేయగా కత్తుల మోహనరావు దర్శకత్వం వహించారు.

మన్యం కొండ జాతర ఏర్పాట్లపై సమావేశం

- పొల్లూరు జలపాతంను పరిశీలించిన ఒడిశా, ఆంధ్ర అధికారులు

మోతుగూడెం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో ఉన్న పొల్లూరు జలపాతంవద్ద మార్చి 3న జరగబోయే మన్యంకొండ జాతరకు ఏర్పాట్లుపై ఐటీడీఏ పీవో అపూర్వభరత్ జలపాతంవద్ద ప్రదేశాలను పరిశీలించారు. అనంతరం ఒడిశా నుంచి సుమారు 40వేల మంది భక్తులు జాతరకు వస్తారని ఒడిశా అధికారులు తెలపగా గత సంవత్సరం ఒడిశా అధికారులు సీలేరు నదిపై ఫ్లోటింగ్ బ్రిడ్జి ఏ ర్పాటుచేశారని ఈ సంవత్సరం కూడా ఏర్పాటు చేస్తారని చింతూరు తహసీల్దార్ చిరంజీవి, పంచాయతీ కార్యదర్శి జి.మోహ న్ ఐటీడీఏ పీవోకు తెలిపారు. ఒడిశా, ఆంధ్ర అధికారులు సమష్టిగా పనిచేద్దామని తెలిపారు. కార్యక్రమంలో ఒడిశా రాష్ట్రం కలిమిల తహసీల్దార్ రామకృష్ణ, సత్యరాజ్, మల్కన్‌గిరి తహసీల్దార్ టక్కున పుట్ట, మోటు తహసీల్దార్ ప్రభాస్‌కుమార్ బడ్నైక్, ఏబీడీవో కలిమెలా వసంత్ కుమార్ బొహరా, మల్కన్‌గిరి రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, మోతుగూడెం అధికారులు సాయిబాబా మామ్బో, ఫారెస్ట్ ఎఫ్ఎస్‌వో మోహన్, ఎస్ఐ శివనారాయణ, ఏపీజెన్‌కో సివిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వరప్రసాద్, ఏడీఈ కొండబాబు పాల్గొన్నారు.



పొల్లూరు జలపాతంను పరిశీలిస్తున్న ఆంధ్ర, ఒడిశా అధికారులు

కష్టాలు.. తీరేదెప్పుడో?



వాడపల్లిలో తిరువీధులలో భక్తుల రద్దీ(ఫైల్)

- వాడపల్లి వెంకన్న ఆలయం వద్ద భక్తులకు ఇక్కట్లు
- రోడ్లపై ఆక్రమణలు.. ఇరువైపులా చిరు వ్యాపారాలు
- ఆలయ తిరువీధుల్లో భక్తులకు తోపులాట కష్టాలు

ఆత్రేయపురం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం రాష్ట్రంలోనే ప్రసిద్ధి గాంచిన క్షేత్రంగా విరాజిల్లుతోంది. వివిధ రాష్ట్రాల నుంచి వేలాదిమంది భక్తులు స్వామివారిని దర్శించుకుంటున్నారు. కానీ, ఆలయంవద్ద కొన్ని ఇబ్బందులతో భక్తులకు ఇక్కట్లు తప్పడంలేదు. రోడ్డుపై ఆక్రమణలతో తిరువీధుల్లో ఒక్కోసారి తోపులాటలు లాంటి ఘటనలు జరుగుతున్నాయి.

రోడ్డు మీదే వ్యాపారాలతో..

వాడపల్లి ఆలయంలో ప్రతి శనివారం 50వేల మంది భక్తులు ప్రదక్షిణలు నిర్వహించుకుని స్వామిని దర్శించుకుంటున్నారు. ఆలయం డిప్యూటీ కమిషనర్ హోదాస్థాయి పెరిగి రూ.25 కోట్లు వార్షిక ఆదాయానికి చేరుకుంది. అయినా భక్తులకు వసతి, సౌకర్యాలు అంతంతమాత్రంగా ఉంటున్నాయి. గతంలో టీడీపీ హయాంలో వాడపల్లివద్ద కొత్త వంతెన నిర్మించి పక్కా రహదారులను నిర్మించారు. రవాణా సౌకర్యం మెరుగుపర్చినా భక్తుల ట్రాఫిక్ కష్టా లు పెరిగిపోతున్నాయి. శ్రీనివాస ప్రాంగణంతోపాటు పుష్కరఘాట్‌వద్ద పార్కింగ్ సౌకర్యాలు ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని వివిధ డిపోలనుంచి ఆర్టీసీ ద్వా రా భక్తులు స్వామి సన్నిధికి చేరుకుంటున్నారు. తిరువీధుల్లో భక్తుల ప్రదక్షిణలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అక్కడ చిరువ్యాపారులు రోడ్డు మీదే వ్యాపారాలు సాగించడంతో భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పార్కింగ్ ప్ర దేశంనుంచి ఆలయాలకు వెళ్లే రెండు దారులు, తిరువీధుల్లో నాలుగు మార్గాలవద్ద వ్యాపారాలు రోడ్డు మీదే ఏర్పాటు చేయడంతో భక్తులు అష్టకష్టాలు పడుతున్నారు. రాజకీయఒత్తిళ్లతో వ్యాపా రులను ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. రహదారులపై ఇసుక, కంకర గుట్టలను నివాస గృహాల వారు నిల్వ చేసుకున్నారు. పుష్కరఘాట్‌కు వెళ్లే ప్రదేశం ఆక్రమణలతో బక్కచిక్కింది. పుష్కర ఘాట్‌కు వెళ్లే మార్గంవద్ద మటన్, చికెన్‌షాపులు ఏర్పాటు చేయడంతో భక్తులు అసహనం వ్యక్తం చేస్తూ ముక్కుమూసుకుని వెళ్తున్నారు. మరికొన్ని వీధుల్లో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. షాపుల వద్ద భక్తులు గుమిగూడడంతో ప్రదక్షిణ చేసేవారు మండిపడుతున్నారు. అసలే ఇరుకుప్రదేశం.. మరో పక్క రోడ్డు ఆక్రమణలు, భక్తుల రద్దీ పెరిగిపోవడంతో భక్తుల నగదు, బ్యాగులు, సెల్‌ఫోన్లు చోరీలకు గురవుతున్నాయి. భక్తుల ఇబ్బం దులను దేవదా యశాఖ పరిష్కరించాల్సి ఉంది. మెరుగైన సౌకర్యాలతోపాటు స్వామి దర్శనం సకాలంలో జరిగేలా చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.



వాడపల్లిలోని వెంకన్న ఆలయానికి పార్కింగ్ ప్రదేశంనుంచి వచ్చే రోడ్డు మార్గం దుకాణాలతో ఆక్రమించిన దృశ్యం



వాడపల్లి పుష్కరఘాట్‌వద్ద స్నానాలు ఆచరించేందుకు వెళ్లే మార్గంవద్ద ఆక్రమణతోపాటు మాంసం దుకాణం విక్రయాలు

బెండపూడి విద్యార్థికి..

గవర్నర్ ఎట్‌హోంకు ఆహ్వానం

- రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో సోలార్ పలకల ప్రాజెక్టు వ్యక్తిగత విభాగంలో ప్రథమస్థానం



ఎట్‌హోంకు ఆహ్వానం పొందిన విద్యార్థి బలరాం శివ

తొండంగి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): బెండపూడి ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి బలరాం శివకు రాష్ట్ర గవర్నర్ కార్యాలయం నుంచి ఎట్‌హోం కార్యక్రమానికి ఆహ్వానం అందింది. రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో బలరాం రూపొందించిన సూర్యుడిని అనుసరించే సోలార్ పలకలు అనే ప్రాజెక్టు వ్యక్తిగత విభాగంలో ప్రథమస్థానాన్ని సాధించింది. ఇది దక్షిణ భారత దేశ విద్యావైజ్ఞానిక విభాగానికి ఎంపికైంది. ఈ నేపథ్యంలో రిపబ్లిక్ డే సందర్భంగా గవర్నర్ బంగ్లాలో వివిధ రంగాల ప్రముఖులకు ఇచ్చే విందులో శివ పాల్గొనే అరుదైన అవకాశాన్ని సొంతం చేసుకున్నాడు. ఈనెల 26న రిపబ్లిక్‌డే రోజున సాయంత్రం 4.30 గంటలకు జరిగే విందుకు హాజరు కావాల్సిందిగా గవర్నర్ కార్యాలయం నుంచి ఆహ్వానం అం దడంతో శివకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. తొండంగి ఎంఈవోలు షేక్ బాబ్జి, ఎ.సుబ్బిరెడ్డి, బెండపూడి గ్రామాభివృద్ధి కమిటీ ఛైర్మన్ సాధనాల నూకరాజు, విద్యా కమిటీ సభ్యులు అభినందించారు.

రిపబ్లిక్ డే వేడుకలకు ఆహ్వానం

- ఢిల్లీకి పయనమైన ఉమ్మడి జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు

కాకినాడ సిటీ, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఈనెల 26న ఢిల్లీలో జరగనున్న రిపబ్లిక్ డే వేడుకల్లో పాల్గొనేందుకు ఆహ్వానం అందడంతో కాకినాడకు చెందిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు బలసాడి రంగారావు, ఆయన సతీమణి బలసాడి లక్ష్మి శుక్రవారం బయలుదేరి వెళ్లారు. రోడ్డు మార్గం గుండా విశాఖ చేరుకుని అక్కడ మరో ఆరుగురు మత్స్యకార ప్రతినిధులతో కలిసి విమానంలో ఢిల్లీ వెళ్లారు. నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా వీరిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బలసాడి రంగారావు మాట్లాడుతూ కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు సహకారంవల్లే తమను ఎంపిక చేశారని ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.



బలసాడి రంగారావు

మత్స్య సంపద దోపిడీ

- గోదావరిలో అర్ధరాత్రి వలలతో చేపల వేట
- దేవీపట్నం నుంచి టన్నుల కొద్దీ లారీల్లో తరలింపు
- ఇతర ప్రాంతాల నుంచి వచ్చి దౌర్జన్యం
- ఆవేదన వ్యక్తం చేస్తున్న గిరిజన నిర్వాసితులు
- పట్టించుకోని అధికారులు



గోదావరి నదిలో వేటాడిన చిన్న చేపలు

దేవీపట్నం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): దేవీపట్నం మండలంలో గోదావరి మత్స్య సంపద దోపిడీ జరుగుతోంది. దీన్ని పట్టించుకునేవారే కరువయ్యారు. మండలంలో కొందరు అక్రమంగా గోదావరిలో చేపలు వేటాడి గండిపోచమ్మ ఆలయం వద్దకు బోట్లపై తీసుకువస్తున్నారు. ఇక్కడినుంచి ట్రాక్టర్‌పై పురుషోత్తపట్నం తరలించి చిన్నచేప ప్యాకింగ్ చేసి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా..

ఏజెన్సీ ప్రాంతమైన దేవీపట్నం మండలంలో 44 గ్రామాల పరిధిలో పోలవరం ప్రాజెక్టు ఉన్న కారణంగా ప్రభుత్వ నిబంధనలు అమలులో ఉన్నాయి. అయినా ఇక్కడ సీడు-ఫీడు ధ్వంసం చేస్తూ ధనార్జన కోసం కొందరు అంతరాష్ట్ర వ్యాపారం చేస్తున్నారు. ఇక్కడి గ్రామాల్లో మత్స్యకారులు, గిరిజనులు వేట నియమాలు కలిగి ఉంటారు. ఆయా గ్రామాల్లో జీవనోపాధికి వీరు మాత్రమే వేట సాగించేందుకు అనుమతి ఉంది. దేవీపట్నం మండలం దేవారం, శరభవరం, ఇందుకూరు, ఇందుకూరుపేట, పోతవరం గ్రామపంచాయతీ పరిధిలో మత్స్యకారులు అద్దె ఇళ్లల్లో ఉంటూ తెల్లవారుజామున సంప్రదాయ వేటాడుతూ జీవనం సాగిస్తున్నారు. దీన్ని అదునుగా తీసుకుని కొందరు కొవ్వూరు, రాజమహేంద్రవరం, ధవళేశ్వరం, కాకినాడ, యానాం, నక్కపల్లి తదితర ప్రాంతాలనుంచి వచ్చి మత్స్యశాఖ నియమ, నిబంధనలకు వ్యతిరేకంగా చిన్న కన్నుల వలలతో చీరమేను అలివి వేటాడుతున్నారు. స్థానిక గిరిజనులు, మత్స్యకారులపై దౌర్జన్యం చేసి మరీ ఈ వేట సాగిస్తున్నారని విమర్శలున్నాయి. దీనిపై అధికారులు స్పందించకపోవడంపై పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రాత్రి సమయాల్లో వేట

అంతరాష్ట్ర ముఠాలతో స్థానికులు కొంతమంది కుమ్మక్కై ఈ వేట సాగిస్తున్నారని తెలుస్తోంది. అక్కడే గోదావరి పరీవాహక ప్రాంతాల్లో మకాం వేసుకుని రాత్రి సమయాల్లో గుట్టుచప్పుడు కాకుండా వేట సాగిస్తున్నారు. టన్నుల కొద్దీ చేపలను బోట్లపై గండిపోశమ్మ ఆలయం వద్దకు చేర్చి అక్కడినుంచి ట్రాక్టర్లపై పురుషోత్తపట్నం తరలిస్తున్నారు. అక్కడ ప్యాకింగ్ చేసి ఇతర ప్రాంతాలకు తరలించేస్తున్నట్లు తెలుస్తోంది. సీడు-ఫీడు గోదావరి గట్లపై పారవేస్తూ నదిలో మత్స్య సంపదను ధ్వంసం చేస్తున్నారు. కోట్ల రూపాయిల్లో ఈ వ్యాపారం జరుగుతున్నా మత్స్య సంపదను దోచుకుపోతున్నా అధికారులు పట్టనట్లు వ్యవహరించడంపై గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



నిబంధనలకు విరుద్ధంగా చేపలను ప్యాకింగ్ చేస్తున్న దృశ్యం

మహిళపై హత్యాయత్నం కేసులో

నిందితుడికి తొమ్మిదేళ్లు జైలు శిక్ష

సర్పవరం జంక్షన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మహిళను లైంగికంగా వేధించి హత్యాయత్నానికి పాల్పడిన నిందితునికి తొమ్మిది సంవత్సరాల జైలు శిక్షను విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చినట్లు సర్పవరం ఎస్‌హెచ్‌వో బొక్క పెద్దిరాజు తెలిపారు. కాకినాడ రూరల్ మండలం వాకలపూడికి చెందిన ఇరవై అయిదేళ్ల కొరుప్రోలు వెంకన్న స్థానికంగా ఉన్న మహిళను 2022వ సంవత్సరంలో లైంగికంగా వేధించి హత్యాయత్నానికి పాల్పడిన కేసులో అప్పటి మహిళా ఎస్‌ఐ వి మౌనిక కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారన్నారు. శుక్రవారం ఈ కేసు విషయమై వాదోపవాదనలు అనంతరం నిందితుడు వెంకన్నపై నేరం రుజువు కావడంతో రాజమహేంద్రవరం ఎనిమిదవ జిల్లా సెషన్స్ జడ్జి వై బెన్నయ్యనాయుడు 9 సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ తీర్పునివ్వడం జరిగిందన్నారు. రూ. 7 వేలు జరిమానా విధించడం జరిగిందన్నారు. నిందితునికి కోర్టులో శిక్షపడేలా కృషి చేసిన పీపీ కె రాధాకృష్ణరాజు బలమైన వాదనలు, కోర్టు కానిస్టేబుల్ ఏ దుర్గారావు సాక్షులను సక్రమంగా కోర్టులో ప్రవేశపెట్టడంతో నిందితునికి శిక్ష పడిందన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

అనపర్తి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : అనపర్తి దేవీచౌక్ సెంటర్ వద్ద గల సామర్లకోట కాలువలో శుక్రవారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. అనపర్తి అదనపు ఎస్‌ఐ దుర్గాప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం ... బస్టాండ్ సమీపం ఎర్రకాలువలో గుర్తు తెలియని మృతదేహం ఉందన్న సమాచారం తమకు అందిందన్నారు. దీంతో అక్కడికి వెళ్లి మృతదేహాన్ని వెలికి తీయించామన్నారు. సుమారు 45 సంవత్సరాల వయసు కలిగిన పురుషుడిగా గుర్తించామన్నారు. మృతదేహం కుళ్లిన స్థితిలో ఉంద న్నారు. మృతుని వద్ద లభించిన దుస్తుల ఆధారంగా పరిసర పోలీస్ స్టేషన్లకు సమాచారం అందించినట్టు ఆయన చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు. మృతుని ఆచూకీ తెలిసినవారు అనపర్తి పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

సారా స్థావరాలపై పోలీసుల దాడి .. మహిళ అరెస్ట్

రంగంపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : రంగంపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధి వెంకన్నపేటలో శుక్రవారం ఎక్సైజ్ పోలీసులు సారా స్థావరాలపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఇందులో పంపన వీరగనిక అనే మహిళ ఐదు లీటర్ల సారా కలిగి ఉన్నట్టు గుర్తించారు. దీంతో సదరు మహిళను అరెస్ట్ చేసినట్టు ఎక్సైజ్ ఎస్‌ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

గోకవరం పోలీస్ స్టేషన్ ఎదుట ..

పెంటపల్లి గ్రామస్థుల ధర్నా

- రోడ్డు ప్రమాదంలో చికిత్స పొందుతూ మృతి చెందిన యువకుడు
- బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ రోడ్డుపై బైఠాయించి నినాదాలు
- ఓ రాజకీయ నేత అడ్డుకుంటున్నాడని ఆరోపణ...
- ఎమ్మెల్యే నెహ్రూ హామీతో ఆందోళన విరమణ



ధర్నా చేస్తున్న పెంటపల్లి గ్రామస్థులు

గోకవరం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మృతుని కుటుంబానికి న్యాయం చేయాలంటూ పెంటపల్లి గ్రామస్థులు శుక్రవారం గోకవరం పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నాకు దిగారు. వివరాల్లోకి వెళ్తే.. పెంటపల్లి గ్రామానికి చెందిన సాత్నబోయిన దుర్గాప్రసాద్ (23)అనే యువకుడు కూలీ పనులు చేసుకుంటూ కుటుంబానికి అండగా ఉంటున్నాడు. ఈక్రమంలో ఈనెల 20వ తేదీన సినిమా చూసేందుకు టికెట్ల కోసం గోకవరం వెళ్లాడు. టికెట్లు తీసుకున్న అనంతరం స్నేహితుడిని కూడా సినిమాకు తీసికెళ్లేందుకు మోటారు సైకిల్‌పై బయలు దేరాడు. ఈ నేపథ్యంలో అతను ప్రయా ణిస్తున్న మోటారు సైకిల్ గోకవరం పంచాయతీ కార్యాలయం వద్దకు వచ్చేసరికి రాజమహేంద్రవరం వైపు నుంచి అతి వేగంగా వస్తున్న మరో మోటారు సైకిల్ ఢీకొనడంతో దుర్గాప్రసాద్ తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించగా, అదేరోజు సాయంత్రం మృతిచెందాడు. ఈ ఘటనపై గోకవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దీనికి కారణమైన వ్యక్తిని పోలీసులు గుర్తించినట్టు తెలిసింది. అయితే మృతుని కుటుంబానికి న్యాయం జరగ కుండా ఓ రాజకీయ పార్టీకి చెందిన నాయకుడు అడ్డుకుంటున్నారంటూ గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ప్రమాదానికి కారణమైన వ్యక్తిని ఇంతవరకు ఎందుకు అరెస్ట్ చేయలేదంటూ పోలీసులను ఆందోళనకారులు ప్రశ్నించారు. ఇంతలో స్థానిక ప్రభుత్వాసుపత్రి వద్దకు విచ్చేసిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను ఆందోళనకారులు కలిసి జరిగిన సంఘటనను వివరించారు. దీంతో ఎమ్మెల్యే స్పందించి మృతుని కుటుంబానికి ప్రభుత్వం నుంచి సాయం అందేలా కృషిచేస్తానని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు.

హత్య కేసులో .. నిందితుడికి జీవిత ఖైదు

రాజానగరం,జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఓ హత్య కేసుకు సంబంధించి నిందితుడికి జీవిత ఖైదు ఖరారైంది. వివరాలివి రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలో 2020వ సంవత్స రంలో హత్య కేసు నమోదైంది. ఈ మేరకు నిందితుడికి రాజమహేంద్రవరంలోని 5వ అదనపు కోర్టు జీవిత ఖైదు విధించినట్టు రాజానగరం సీఐ ఎస్.ప్రసన్న వీరయ్యగౌడ్ శుక్రవారం తెలిపారు. రాజానగరం మండలం రాధేయపాలేనికి చెందిన తన్నీరు రాంబాబు ఇదే గ్రామానికి చెందిన కొప్పిరెడ్డి వెంకన్నను హత్య చేయగా, తన్నీరు వెంకన్న బాబును గాయపర్చాడు. ఈ మేరకు అప్పటి సీఐ ఎంవీ సుభాస్ పర్యవేక్షణలో ఎస్‌ఐ నాగబాబు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేశారు.

అయితే ఎట్టకేలకు రాజమహేంద్రవరం 5వ అదనపు సెషన్స్ జడ్జి సమగ్ర విచా రణ జరిపిన అనంతరం జడ్జి డబ్బిరి విజయ్‌గౌతమ్ నిందితుడికి నేరం రుజువు కావడంతో జీవిత ఖైదు, రూ. ఐదు వేల జరిమానా విధించారు.

ఈ కేసులో ప్రాసి క్యూషన్ తరఫున అప్పటి అదనపు పీపీ శంభుప్రసాద్, పీపీ లక్ష్మణ్ నాయక్ బలమైన వాదనలు వినిపించారు.కోర్టు కానిస్టేబుల్ దుర్గాప్రసాద్ సాక్షులను సకాలంలో ప్రవేశపెట్టారు.

కోరుకొండ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానంలో ..

ఎట్టకేలకు దిద్దుబాటు చర్యలు

- సిబ్బంది నిర్లక్ష్యంపై వచ్చిన ఆరోపణలపై స్పందించిన అన్నవరం దేవస్థానం ఈవో సుబ్బారావు

కోరుకొండ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): చారిత్రాత్మక కోరుకొండ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానంలో పనిచేస్తున్న సిబ్బంది నిర్లక్ష్యంపై భక్తులు, గ్రామస్థుల నుంచి వస్తున్న ఆరోపణలపై ఎట్టకేలకు అన్నవరం దేవస్థానం కార్యనిర్వహణాధికారి (ఈవో) పి. సుబ్బారావు స్పందించారు. దీనికి సంబంధించి శుక్రవారం దిద్దుబాటు చర్యలు చేపట్టారు. ఈ మేరకు దశాబ్ధ కాలంలో దేవస్థానంలో గుమస్తాగా విధులు నిర్వహిస్తున్న ఆర్.రవికుమార్‌ను ఆయన సొంత స్థానమైన రాజమహేంద్రవరం ఆర్యాపురం సత్యనారాయణ దేవస్థానం నుంచి బదిలీ చేశారు. అదేవిధంగా అన్నవరం దేవస్థానానికి చెందిన పి.వెంకటరమణ ఇప్పటి వరకు కోరుకొండ దేవస్థానం ఇన్‌చార్జిగా కొనసాగుతున్న ఆయన్ని ఇక్కడ నుంచి తిరిగి అన్నవరానికి బదిలీ చేశారు. ఆ స్థానంలో బి. సత్యశ్రీనివాస్, ఆర్.రవికుమార్ స్థానంలో టి.రాంజీని నియమించారు. దీనిపై అన్నవరం దేవస్థానం కార్యనిర్వహణాధికారి సుబ్బారావు లిఖిత పూర్వక ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఇప్పటివరకు కోరుకొండ దేవస్థానంలో పనిచేస్తున్న రవికుమార్‌ను బదిలీ చేసి అన్నవరం దేవస్థానం నుంచి ఆ స్థానంలో సత్యశ్రీనివాస్, రాంజీను నియమించారు. అయితే అనేక అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఇద్దరు ఉద్యోగులను బదిలీ చేసి చేతులు దులుపుకుంటే సరిపోతుందా... అన్న అనుమానం స్థానికుల్లో ఉంది. దీనిపై లోతైన విచారణ జరిపి, చేసిన ఉద్యోగులకు కఠిన శిక్ష అమలు చేస్తేనే దేవస్థానంలో అభివృద్ధి జరుగుతుందని భక్తుల అభిమతం.

బ్యాడ్మింటన్‌లో విద్యార్థుల ప్రతిభ

రాజోలు,జనవరి 24(ఆంధ్రజ్యోతి): కోనసీమ క్రీడోత్సవాల్లో జిల్లాస్థాయిలో జరిగిన బ్యాడ్మింటన్ విభాగంలో కడలి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయిలో ద్వితీయ స్థానం సాధించారని విద్యాకమిటీ చైర్మన్ వి.ప్రకాశరావు తెలిపారు. విద్యార్థులు వడ్లమూడి శ్రీలక్ష్మీజ్యోతి, కె.మిథునశ్రీలను పలువురు అభినందించారు.

తాబేళ్లదిబ్బలో జాతీయ పతాకం రెపరెపలు

కాట్రేనికోన, జనవరి 24(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన పంచాయతీ తాబేళ్లదిబ్బ ఐలాండ్‌లో ఉన్నతాధికారుల ఆదేశాలతో శుక్రవారం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. జెండా వందనం సమర్పించారు. కాట్రేనికోన ఎస్‌ఐ, సిబ్బంది, తహసీల్దార్, సిబ్బంది, మత్స్యశాఖ, అటవీశాఖల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి: డీఈవో

ముమ్మిడివరం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ విధి నిర్వహణను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా పేర్కొన్నారు. ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాల సెమినార్ హాలులో జిల్లాస్థాయి టీఎఫ్ఎంఎస్ ఆపరేషన్స్‌పై మండలస్థాయి ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, అక్కౌంటెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లతో నిర్వహించిన శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. ముగింపు సందర్భంగా శుక్రవారం జరిగిన సభలో డీఈవో సలీంబాషా మాట్లాడుతూ ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం


శిక్షణా శిబిరంలో మాట్లాడుతున్న డీఈవో షేక్ సలీంబాషా

వహించరాదన్నారు. రాష్ట్రస్థాయి నుంచి వచ్చిన ఆదేశాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలయ్యేందుకు సాంకేతిక సిబ్బంది తమవంతు సహకారం అందించాలన్నారు. రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ శుక్రవారంతో ముగిసింది. ఈసందర్భంగా మండల విద్యాశాఖ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ఐటీ సిబ్బంది సేవలు ప్రశంసనీయమని సలీంబాషా పేర్కొన్నారు. ఈసమావేశంలో సమగ్రశిక్ష సెక్టోరియల్ అధికారులు పి.రాంబాబు, డాక్టర్ ఎంఏకే బీమారావు, ఎంవీవీ సత్యనారాయణ, డీఈవో, సమగ్రశిక్ష ఏఎస్‌వోలు దొమ్మేటి తాతారావు, నారాయణరావు, ఏపీవోలు ఆదినారాయణ, సూర్యనారాయణ, ఆఫీస్ సబార్డినేట్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో ఆలయాలు అభివృద్ధి: సుభాష్

రాజోలు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కూనవరంలో నూతనంగా నిర్మించనున్న అన్నపూర్ణా కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. కూనవరంలో శ్రీఅన్నపూర్ణా కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌తో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే దేవ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి సుభాష్ పాల్గొని మాట్లాడుతూ ఆలయ పునర్నిర్మాణ పనులను ప్రారంభించడం తనపూర్వజన్మ సుకృతమన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో ఆలయాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. ఈ


అన్నపూర్ణా కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభించిన మంత్రి సుభాష్, ఎమ్మెల్యే దేవ

సందర్భంగా ఎమ్మెల్యే దేవ మాట్లాడుతూ శ్రీఅన్నపూర్ణా కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి శాయశక్తులా తోడ్పడతానన్నారు. కూనవరం ప్రజల కోరిక మేరకు లక్షా 20వేల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటరు ట్యాంకును సంవత్సరం లోపు పూర్తిచేస్తానని తెలిపారు. కూనవరం మురికికాల్వపై వంతెన నిర్మాణం చేపడతామన్నారు. కార్యక్రమంలో గోదావరి డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, రాజోలు ఎంపీపీ కేతా శ్రీను, రాజోలు, సఖినేటిపల్లి మండలాల జనసేనపార్టీ అధ్యక్షులు సూరిశెట్టి శ్రీనివాస్, గుబ్బల ఫణికుమార్, సఖినేటిపల్లి మండల టీడీపీ అధ్యక్షుడు ముప్పర్తి నాని, వైస్ ఎంపీపీ ఇంటిపల్లి ఆనందరాజు, సర్పంచ్ బోనం అచ్చయ్యనాథ్, ఉపసర్పంచ్ చెల్లింగి శ్రీనివాస్, కాండ్రేగుల మణి తదితరులు పాల్గొన్నారు.

క్రీడోత్సవంలో అంబాజీపేట విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ కనబరిచిన విద్యార్థునులు

లాంగ్‌జంప్‌లో ప్రథమ, బాస్కెట్‌బాల్ పోటీల్లో రన్నర్స్

అమలాపురంలో కోనసీమ క్రీడోత్సవాల్లో భాగంగా జిల్లా స్థాయిలో జరిగిన పోటీల్లో అంబాజీపేట జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. హెచ్ఎం కడలి సాయిరామ్ మాట్లాడుతూ అమలాపురం జీఎం బాలయోగి స్టేడియంలో జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో రెండు రోజులు పాటు నిర్వహించిన క్రీడల్లో పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారన్నారు. లాంగ్‌జంప్‌లో బి.జోనేశ్వరి ప్రథమ స్థానం, బాస్కెట్‌బాల్ పోటీల్లో జాతీయ స్థాయి క్రీడాకారిణి నిమ్మకాయల చరీష్మారుత్వి, కేఎల్ ప్రసన్న, జి.శిరమల్లి, సీహెచ్ రాజేశ్వరి, కె.సాయిశ్రీ, పి.మేఘన, ఎం.భువనేశ్వరి, పి.జాహ్నవి, బి.మానస, ఎం.నిస్సీఏంజిల్, జి.సింధే, జె.వర్షిని, కె.హేమశ్రీలు రన్నర్స్ నిలిచారన్నారు. క్రీడాకారులు, పీడీ కుంపట్ల ఆదిలక్ష్మిని హెచ్ఎం, ఎస్ఎంసీ చైర్మన్ పితాని త్రిమూర్తులు, వైస్‌చైర్మన్ బండారు అమ్మాజీ, ఉపాధ్యాయులు అభినందించారు.

హెల్మెట్ ధరించకపోవడం వల్లే రోడ్డు ప్రమాదాలు


మాట్లాడుతున్న పట్టణ ఎస్ఐ కిశోర్‌బాబు

అమలాపురం టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలను నివారిద్దాం.. మానవ జీవన ప్రమాణాన్ని పెంచుదామంటూ దళిత బహుజన మహిళాశక్తి ఆధ్వర్యంలో శుక్రవారం అమలాపురం ఎస్కేబీఆర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు చేపట్టిన ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్టు డీబీఎంఎస్ జాతీయ కన్వీనర్ కొంకి రాజామణి తెలిపారు. ముఖ్య అతిథిగా పట్టణ ఎస్ఐ కిశోర్‌బాబు మాట్లాడుతూ హెల్మెట్ ధరించకపోవడం వల్లే రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువమంది చనిపోతున్నారని వివరించారు. గత ఏడాది జిల్లాలో 150మందికి పైగా రోడ్డు ప్రమాదాల్లో చనిపోయారన్నారు.రోడ్డు భద్రతా నియమాలను ప్రతీ ఒక్కరూ పాటించాలన్నారు. మోటారు సైకిళ్లపై వెళ్లేటప్పుడు విధిగా హెల్మెట్ ధరించాలని రాజామణి సూచించారు. ఎస్కేబీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ నూకల శ్రీనివాస్, ఏవీఎస్ఎస్వీ శర్మ పాల్గొన్నారు.

నూతన ఒరవడిని సృష్టించే ఎస్ఆర్ఎం మేళా



ఎస్ఆర్ఎం మేళాలో పాల్గొన్న జిల్లా విద్యాశాఖాధికారి సలీం బాషా

కాట్రేనికోన, జనవరి 24(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యలో ఎస్ఆర్ఎం (స్కూల్ రడీనెస్) మేళా ఒక నూతన ఒరవడిని సృష్టిస్తుందని డీఈవో సలీం బాషా అన్నారు. చెయ్యేరు శ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న ఉపాధ్యాయ శిక్షణా శిబిరంలో అయిదవ రోజు శుక్రవారం ఎస్ఆర్ఎం మేళా డెమో నిర్వహించారు. ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీలో భాగంగా స్కూల్ రడీనెస్ ప్రోగ్రాం అనే నూతన అంశాన్ని సమాజానికి ఎలా పరిచయం చెయ్యాలనే విషయాన్ని ఉపాధ్యాయులకు తెలియజేశారు. శిక్షణా శిబిరం ఇన్‌చార్జి, ఏఎంవో పి.రాంబాబు మాట్లాడుతూ ఎస్ఆర్ఎం మేళా క్షేత్రస్థాయిలో అమలుచేస్తే పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో వైవీవీ సత్యనారాయణ, ప్రథమ్ డిస్ట్రిక్ కో ఆర్డినేటర్ జీవన్‌సందీప్, కేఆర్పీలు మామిడిశెట్టి రాంబాబు, అంకం చంద్రసూర్యం, డీఆర్పీలు పాల్గొన్నారు.

మేజర్ డ్రెయిన్‌లో పూడికతీత పనులు

అమలాపురం రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): అమలాపురం ఏజీ రోడ్డును ఆనుకుని ఈదరపల్లిలో ఉన్న మేజర్ డ్రెయిన్ పూడికతో నిండిపోవడంతో తరచూ మురుగనీరు రోడ్డెక్కుతుంది. అయితే ఈదరపల్లి పంచాయతీ తరఫున పూడికతీత పనులు చేపడుతున్నప్పటికీ కొనసాగింపుగా అమలాపురం పురపాలక సంఘం తరఫున పూడికతీత చేపట్టకపోవడంతో తరచూ సమస్య ఉత్పన్నమవుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం ఏజీ రోడ్డులో జేసీబీ సాయంతో పూడికతీత పనులను చేపట్టారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పోలిశెట్టి వీరబాబు, కార్యదర్శి కోడూరి వెంకటేశ్వరరావు, డి.నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన పంటకాల్వలో చెత్త తొలగింపు

పి.గన్నవరం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): రాజవరం -పొదలాడ కెనాల్ రోడ్డులో గోపాలపురం సెక్షన్ పరిధిలోని ఉడిమూడి, గంటి పెదపూడి, బెల్లంపూడి గ్రామాల పరిధిలో ప్రధాన పంటకాల్వలో చెత్త పేరుకుపోయింది. దీంతో గత నెల 25న 'ఆంధ్రజ్యోతి'లో సాగునీరు సాగేదెలా కథనం ప్రచురితమైంది. ఎట్టకేలకు స్పందించిన ఇరిగేషన్ అధికారులు కాల్వలో పేరుకుపోయిన గుర్రపుడెక్క, తీగ మొక్కలను తొలగింపచేశారు. అయితే తాటిపాక సెక్షన్ పరిధిలోని మొండెపులంకలాకు పరిసర ప్రాంతాల్లో ప్రధాన పంటకాల్వలో తీగ మొక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాలు భారీగా పేరుకుపోయాయి. రెండో పంటకు సాగునీరుకు కష్టం కావడంతో పంటకాల్వల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని ఈప్రాంత రైతులు అధికారులను కోరుతున్నారు.

గణతంత్ర దినోత్సవానికి ఫైనల్ రిహార్సల్స్

యానాం, జనవరి24(ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం జీఎంసీ బలయోగి క్రీడామైదానంలో పోలీసులు కవాతుఫైనల్ రిహార్సల్స్ నిర్వహించారు. ఎస్పీ రాజశేఖరన్ నేతృత్వంలో సీఐ షణ్ముగం పుదుచ్చేరి పోలీస్, ఇండియన్ రిజర్వ్ బెటాలియన్, హోంగార్డ్స్, ఎన్‌సీసీ, విద్యార్థులు కవాతులో పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల రిహార్సల్స్ ప్రదర్శనలు నిర్వహించారు. ఆదివారం పరిపాలనాధికారి మునిస్వామి జాతీయ జెండాను ఎగురవేసి పోలీసుల నుంచి గౌరవవందనం స్వీకరిస్తారు.

ఉత్సవాల నిర్వహణలో భాగస్వాములవ్వాలి: ఎమ్మెల్యే


అంతర్వేది ఉత్సవాలపై డీఎల్పీవో, పంచాయతీ సెక్రటరీ, సర్పంచ్‌లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ

అంతర్వేది, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి వార్షిక కల్యాణ మహోత్సవాల్లో అధికారులందరూ భాగస్వాములై ఉత్సవాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. రాజోలు నియోజకవర్గ, మండల అధికారులతో వరుసగా సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ముందుగా ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో మాట్లాడారు. భక్తులకు తాగునీటి ఇక్కట్లు లేకుండా ట్యాంకర్లను ఏర్పాటు చేయాలన్నారు. అలాగే డీఎల్పీవో, పది గ్రామాల కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఫీల్డుఅసిస్టెంట్లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, వచ్చిన ప్రతీ భక్తుడు ఉత్సవ నిర్వహణ కార్యక్రమాల్లో పరిశుభ్రత పాటించేలా దృష్టి సారించాలన్నారు. పుణ్యక్షేత్ర ఆలయాలు, తీర్థ మహోత్సవ ప్రదేశాలు, పరిశుభ్రత ముఖ్యమన్నారు. భక్తులకు మొబైల్ టాయిలెట్లు, స్నానాల రేవులో వసతిగదులు త్వరితగతిన పూర్తిచేసే బాధ్యత తీసుకోవాలన్నారు. ఉత్సవ సేవా కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ, రాజోలు డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ గుబ్బల శ్రీను, ఎంపీపీ వీరా మల్లిబాబు, ఎంపీటీసీ బైరా నాగరాజు, వివిధ శాఖల అధికారులు, కార్యదర్శులు, ఎంపీటీసీలు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరాలయంలో వెండి సామగ్రి చోరీ


దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ హరీష్‌కుమార్

అల్లవరం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): అల్లవరం మండలం సామంతకుర్రులో గురువారం అర్ధరాత్రి శ్రీవేంకటేశ్వరాలయంలో ఇద్దరు దొంగలు చొరబడి ముఖానికి మాస్కులు ధరించి ఆలయంలోకి ప్రవేశించినట్టు సీసీ ఫుటేజీల ద్వారా నిర్ధారించారు. అర్ధరాత్రి 12.34గంటలకు దొంగతనం జరిగింది. దొంగలు వెలుగుతున్న లైట్లు, సీసీ కెమెరాలను ధ్వంసంచేసి దొంగతనానికి తెగబడ్డారు. గర్భగుడి గేటు తాళం పగులకొట్టి లోపల ఉన్న ఐదు కిలోల వెండి సామగ్రిని అపహరించుకుపోయారు. ధ్వంసం చేసిన సీసీ కెమెరాలను పక్కనున్న చెరువులో దొంగలు పడేసినట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది. మర్నాడు గ్రామస్తులు వెంకటేశ్వరాలయానికి వెళ్లగా తాళం పగులకొట్టినట్టు గుర్తించి ఆలయ అర్చకునికి సమాచారం అందించారు. అల్లవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ జి.హరీష్ కుమార్ బృందం వెంకటేశ్వరాలయంలో జరిగిన దొంగతనంపై క్షుణ్ణంగా దర్యాప్తు చేస్తున్నారు. కేసు నమోదుచేసినట్టు ఎస్ఐ తెలిపారు. మండలంలో పలు గ్రామాల్లో వరుస దొంగతనాలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కొమరగిరిపట్నంలోని గుడుల్లో, అల్లవరంలో వ్యాపార దుకాణాలు, గోడిలంక, తూర్పులంక పరిసరాల్లో చెరువుల వద్ద 5మోటారు సైకిళ్లు, దేవగుప్తం, బోడసకుర్రు గ్రామాల్లో మద్యం షాపుల్లోను గతంలో వరుస దొంగతనాలు జరిగాయి.

దివంగత గురునాథరాజుకు ఎనలైటనింగ్ ఎడ్యుకేటర్ అవార్డు

అమలాపురం టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తిలో ఉండి మరణించే వరకు విద్యార్థులకు, సమాజానికి విద్యను అందించే ఉత్తమ ఉపాధ్యాయులను గుర్తించి ఏటా ఎన్‌లైటనింగ్ ఎడ్యుకేటర్ అవార్డును అందజేస్తున్నట్టు శివానిక్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ సాంబశివరావు తెలిపారు. అమలాపురం యర్రమిల్లివారివీధిలోని కార్యాలయంలో నిర్వహించిన అవార్డు ప్రదానోత్సవ సభలో ఆయన మాట్లాడుతూ కార్యా సాధకుడికి అర్ధరాత్రి కూడా సూర్యోదయమే అనే వాక్యం దివంగత వీవీవీ గురునాథరాజుకు వర్తిస్తుందన్నారు. సైన్స్ పనోరమ అధ్యక్షుడిగా, గ్లోబల్ టీచర్స్ రోల్‌మోడల్ అవార్డు గ్రహీత, త్రిపుల్ వరల్డ్ రికార్డు హోల్డర్ అయిన ఉత్తమ ఉపాధ్యాయుడు దివంగత గురునాథరాజును ఎన్‌లైటనింగ్ ఎడ్యుకేటర్ అవార్డుకు ఎంపిక చేశామన్నారు. ఆయన తరపున బంధువైన డీఎస్ శ్రీనివాస్‌కు అవార్డును అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ సీహెచ్ శాంతిస్వరూప్, గురునాథరాజు సతీమణి లక్ష్మీనర్సమాంబ, పి.నరసింహారావు, సృజన పాల్గొన్నారు.

యానాంలో డిప్యూటీ కమాండెంట్ పర్యటన

యానాం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి పోలీస్ శాఖలో ఇండియన్ రిజర్వ్ బెటాలియన్ డిప్యూటీ కమాండెంట్ మురుగవేలు యానాంలో పర్యటించారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా ఆయన యానాం వచ్చారు. శుక్రవారం ఉదయం స్థానిక ట్రాఫిక్ స్టేషన్ సమావేశపు హాలులో పోలీస్‌వెల్ఫేర్ సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో ఎస్పీ రాజశేఖరన్, సీఐ షణ్ముగం, ఎస్ఐ మురుగునాథం, ఇంళ్లంగో, నూకరాజులు, సిబ్బంది హాజరయ్యారు. ఈసందర్భంగా కమెండెంట్ మురుగవేలు మాట్లాడుతూ సిబ్బంది ప్రజలతో మమేకమై ప్రజాసమస్యలు పరిష్కరిస్తూ పోలీసులపట్ల మరింత నమ్మకం ఏర్పడేలా పనితీరును మెరుగుపరుచుకోవాలన్నారు. అనంతరం సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను కమెండెంట్ దృష్టికి తీసుకువచ్చారు. అదేవిధంగా వివిధ గ్రామాలకు చెందిన పెద్దలు, యువజన సంఘాల ప్రతినిధులతో మాట్లాడి గ్రామాల్లో శాంతిభద్రత అంశాలపై చర్చించారు.

ఉచిత పశువైద్య శిబిరం

రాజోలు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): చింతలపల్లిలో ఉచిత పశువైద్య శిబిరాన్ని సర్పంచ్ మట్టా ప్రసన్నకుమారి శుక్రవారం ప్రారంభించారు. 40పశువులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశామని మండల పశువైద్యాధికారి డాక్టర్ సంపత్‌కుమార్ తెలిపారు. ఉపసర్పంచ్ బొక్కా రామకృష్ణ, వీఎల్వో విజయశేఖర్, ఏహెచ్ఏలు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్లకు న్యాయం చేయాలి

మలికిపురం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రాజోలు నియోజకవర్గంలోని కాంట్రాక్టర్లందరికీ పనులు సమానంగా కేటాయించాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వపరంగా వచ్చే పనులన్నీ ప్రభుత్వ నిబంధనల ప్రకారం సకాలంలో పూర్తి చేస్తామని వినతిపత్రంలో పేర్కొన్నారు. కొంత కాలంగా తమ కాంట్రాక్టర్లు ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నారని, ముఖ్యంగా గడచిన ఐదు సంవత్సరాల్లో చేసిన పనులకు బిల్లు రాక, గత టీడీపీ పాలనలోచేసిన పనులకు కూడా బిల్లులు రాక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్టు వినతిపత్రంలో పేర్కొన్నారు. తమకు న్యాయం చేయాలని కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో ఉండపల్లి బ్రహ్మజీరావు, అన్నంనీడి చినవెంకన్న, వీరా చలపతి, గంగుల శ్రీనివాసరావు, బొంతు గణేశ్వరరావు తదితరులు ఉన్నారు.

బాలికల రక్షణకు అందరూ ముందుకు రావాలి


సేవ్ ద చైల్డ్ అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న దీప్తి విద్యార్థులు

మామిడికుదురు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): బాలికల రక్షణకు ప్రతీ ఒక్కరూ ముందుకు రావాలని దీప్తి స్కూలు కరస్పాండెంట్ డీవీవీ సత్యనారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సుబ్బలక్ష్మి, అన్నపూర్ణ, విజయలత కోరారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని మామిడికుదురు దీప్తి స్కూలు, అప్పనపల్లి, పాశర్లపూడి, పాశర్లపూడిలంక, పెదపట్నంలంక గ్రామాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. దీప్తి స్కూలులో విద్యార్థినులు సేవ్ ద గర్ల్ సేవ్ ద న నేషన్ అంటూ ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. బాలికలు లేనిదే సృష్టి లేదని, ప్రతీ ఒక్కరు బాలికల సంరక్షణకు నడుం బిగించాలన్నారు. స్కూలు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ బాలికా దినోత్సవం

ముమ్మిడివరం, జనవరి24(ఆంధ్రజ్యోతి): బాలికలు విద్యావంతం కావడం ద్వారానే వారికి స్వేచ్ఛ, సమానత్వం లభించి ఉన్నత స్థాయికి చేరుకుంటారని విశ్వాస్ ఒకేషన్ కళాశాల ప్రిన్సిపాల్ నక్కా సత్యనారాయణ పేర్కొన్నారు. ముమ్మిడివరంలోని విశ్వాస్ ఒకేషన్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయబాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వహించిన సదస్సులో ప్రిన్సిపాల్ మాట్లాడారు. కళాశాల డైరెక్టర్ ఎ.బుజ్జిదొర, అధ్యాపకులు పి.కృష్ణ, చిన్నం శ్రీనివాస్, జి.శ్రీనివాస్, కె.విజయకుమారి, వనిత, పద్మ, కాగిత రాజు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

ముమ్మిడివరం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): అన్నక్యాంటీన్ ద్వారా పేదలకు అందిస్తున్న ఆహార పదార్థాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ముమ్మిడివరం నగర పంచాయతీ కమిషనర్ పి.రవివర్మ సూచించారు. ముమ్మిడివరం బళ్లగేటు సెంటర్‌లో ఉన్న అన్నక్యాంటీన్‌ను కమిషనర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. టోకెన్లు జారీచేసే విధానం, ఆహారం నాణ్యత, సిబ్బంది విధుల నిర్వహణ తదితర విషయాలను ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఏఈ పీవీ సుధాకర్, హెల్త్ అసిస్టెంట్ జె.సత్యనారాయణరాజు, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఓటర్ల దినోత్సవం

యానాం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): యానాంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని శనివారం నిర్వహించేందుకు యానాం ఎన్నికల శాఖ ఏర్పాట్లు చేస్తుంది. శనివారం స్థానిక డాక్టర్ ఎస్ఆర్కే ప్రభుత్వ ఆర్ట్ కళాశాలలో నిర్వహించే ఓటర్ల దినోత్సవ కార్యక్రమానికి యానాం ఓటర్ల నమోదు అధికారి మునిస్వామి ముఖ్యఅతిథిగా హాజరై నూతన ఓటర్లతో ప్రతిజ్ఞ చేయిస్తారు. శుక్రవారం విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు. ఈపోటీలను యానాం ఆర్ఏ మునిస్వామి, అధికారులు పర్యవేక్షించారు.

జేవీఎల్‌కు అవార్డు



ముమ్మిడివరం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): పలు సామాజిక సేవా కార్యక్రమాలు అందించినందుకు ఠాణేలంకమొల్లికి చెందిన ఎల్బా అంతర్జాతీయ కన్వీనర్ డాక్టర్ జేవీఎల్ నరసింహారావుకు విశ్వప్రతిభారత్న అవార్డు లభించింది. 40ఏళ్లుగాఆంగ్ల ఉపాధ్యాయునిగా, ఉపాధ్యాయ శిక్షకుడిగా, వ్యాస రచయితగా, ఆంగ్లపాఠ్య పుస్తక రచయితగా సేవలందించినందుకు నరసింహారావుకు డిల్లీకి చెందిన పీఆర్ఎం ఫౌండేషన్ విశ్వప్రతిభారత్న అవార్డుకు ఎంపిక చేసింది. కాకినాడకు చెందిన విశ్రాంత ఆంగ్ల భాషా విభాగాధిపతి నుంచి అవార్డును అందుకోనున్నారు.

పశుఆరోగ్య శిబిరం

కాట్రేనికోన, జనవరి 24(ఆంధ్రజ్యోతి): సత్తెమ్మచెట్టు గ్రామంలో శుక్రవారం ఉచిత పశుఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. పశుసంవర్థకశాఖ జిల్లా అధికారి కె.వెంకట్రావు ఆధ్వర్యంలో అసిస్టెంట్ డైరెక్టర్ బి.నాగేశ్వరరావు, మండల పశువైద్యాధికారిణి టీఎం యామిని పశువులకు వైద్యసేవలందించారు. నట్టల నివారణ, ఏలికపాముల నివారణ మందులు ఇచ్చారు. పాడి పశువులకు గర్భకోశ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ గంటి వెంకటసుధాకర్, వైస్ ఎంపీపీ సానబోయిన నాగేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నాగిడి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి సన్మానం

మలికిపురం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన అడబాల సత్యనారాయణను గూడపల్లిలో ఎన్డీఏ నాయకులు శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎంఏ వేమా, సుందర బ్రహ్మయ్య, అడబాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

డంక్ అండ్ డ్రైవ్ కేసులో వ్యక్తికి ఐదు రోజులు జైలు

ముమ్మిడివరం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): అంబాజీపేట మండలం మాచవరానికి చెందిన ముద్రగడ అప్పన్నకుమార్ మద్యం సేవించి వాహనం నడుపుతూ ముమ్మిడివరం పోలీసులకు పట్టుబడ్డాడు. అతడ్ని పోలీసులు కోర్టులో హాజరుపర్చారు. ముమ్మిడివరం జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ మహ్మద్ రహ్మతుల్లా ఐదురోజులు జైలుశిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చినట్టు ముమ్మిడివరం ఎస్ఐ డి.జ్వాలాసాగర్ తెలిపారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో సింధుకు స్వర్ణ పతకం


సింధును అభినందిస్తున్న ఉపాధ్యాయులు

అమలాపురం రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కోనసీమ క్రీడోత్సవాల్లో భాగంగా నిర్వహించిన జిల్లాస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ఇందుపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థిని బి.సింధు అద్భుత ప్రతిభ చాటి స్వర్ణ పతకం సాధించింది. అండర్-14 వెయిట్ లిఫ్టింగ్‌లో 55కిలోల బరువు ఎత్తి ప్రథమస్థానం సాధించింది. కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ చేతులమీదుగా స్వర్ణ పతకం అందుకున్న సింధును శుక్రవారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు వి.శ్రీనివాసరావు, పీఈటీ వి.నరసింహారావు, సర్పంచ్ చొల్లంగి శివాళిని అప్పాజీ, ఎస్ఎంసీ చైర్మన్ మంగతాయారు, జి.పెద్దిరాజు తదితరులు అభినందించారు.

రైల్వే నిర్మాణ పనులు వేగవంతం చేయాలి


శానపల్లిలంకలో రైల్వే పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అయినవిల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రైల్వే నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ రావిరాల మహేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం శానపల్లిలంక వద్ద రైల్వే పనులను కలెక్టర్ పరిశీలించారు. భూముల్లో పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో కొత్తపేట రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీకర్, తహశీల్దార్ నాగలక్ష్మమ్మ, రైల్వే జేఈ రాహుల్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీల్లో రన్నర్స్‌గా ముక్తేశ్వరం హైస్కూలు

అయినవిల్లి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి క్రీడోత్సవాల్లో ముక్తేశ్వరం జడ్పీ హైస్కూలు విద్యార్థులు రన్నర్‌గా నిలిచారు. అమలాపురం జీఎంసీ బాలయోగి స్టేడియంలో జరిగిన వాలీబాల్ ఫైనల్స్ పోటీల్లో జడ్పీ విద్యార్థులు గెలుపొంది కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా చేతులమీదుగా ట్రోఫీని అందుకున్నారు. విద్యార్థుల విజయానికి కృషి చేసిన పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ ఎం.రమేష్, వ్యాయామ ఉపాధ్యాయుడు కె.వెంకట్రావులను జడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాస్, మండల పరిషత్ అధ్యక్షురాలు మట్టపర్తి నాగవిజయలక్ష్మి, హెచ్ఎం ఎన్.గణేశ్వరరావు, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ యడ్ల లక్ష్మీదుర్గ, వైస్‌చైర్మన్ బొక్కా శ్రీనివాస్, సర్పంచ్ కుడుపూడి శాంతావతి తదితరులు అభినందించారు.

రైతుల ప్రయోజనాలకు కృషి

మలికిపురం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రైతుల ప్రయోజనాలకు కృషి చేస్తామని లక్కవరం నీటి సంఘ అధ్యక్షుడు రాపాక మల్లికార్జునరావు అన్నారు. గూడపల్లి నంబర్ వన్ పంటకాల్వను పరిశీలించారు. శివారు భూములకు సాగునీరు అందేవిధంగా కృషి చేస్తామన్నారు. కాల్వలో పూడికలను తొలగిస్తామని, అవసరమైనచోట గోడలు నిర్మిస్తామన్నారు. నీటిసంఘం ఉపాధ్యక్షుడు కె.కనకేశ్వరరావు, సుందర బ్రహ్మయ్య పాల్గొన్నారు.

హైస్కూలుకు బీరువా వితరణ

మామిడికుదురు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): లూటుకుర్రులోని కసిరెడ్డి వెంకటాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1986-87 పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు స్కూల్‌కు బీరువా వితరణ చేశారు. రూ.15వేలు విలువైన బీరువాను శుక్రవారం స్కూలు హెచ్ఎం జి.నాగప్రసాద్‌కు అందజేశారు. కడలి రాంబాబు, కడలి నూకరాజు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు సాధనాల రాజీనామా

అల్లవరం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మొగళ్లమూరు శివారు శిరగట్లపల్లికి చెందిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సాధనాల చినసత్యనారాయణ పదవికి, కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. పదేళ్లుగా కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషిచేశారు. రాజీనామా లేఖలను జిల్లా అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి అయితాబత్తుల సుభాషిణికి అందజేసినట్టు ఒక ప్రకటనలో తెలిపారు.

సాగునీరందక రైతుల ఇక్కట్లు

కాట్రేనికోన, జనవరి 24(ఆంధ్రజ్యోతి): లంకకాల్వ ఆయకట్టు రైతులు పొలాలకు సాగునీరందక ఇక్కట్లు పడుతున్నారు. లంకకాల్వ తూడుతో పూడుకు పోవడంతో నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారింది. అయినాపురం ప్రధాన పంటకాల్వకు బ్రాంచికాల్వగా ఉన్న లంకకాల్వ చిలకమ్మచెరువు సమీపంలో పూడికతో అధ్వానంగా ఉంది. ఈకాల్వపై 1200ఎకరాల ఆయకట్టు ఉంది. లంకకాల్వలో పూడికతీత పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

బాలికలు మోసాలకు గురికావద్దు

అంబాజీపేట, జనవరి 24(ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్లు, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లు వంటి మోసపూరిత యాప్‌లను చూసి బాలికలు మోసాలకు గురికావద్దని హైస్కూల్ హెచ్ఎం కె.సాయిరామ్ పేర్కొన్నారు మాచవరం, మొసలపల్లి పంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్ల ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికల పట్ల చిన్నచూపు తగదని, బాలిక చదువు ఇంటికి వెలుగ నిస్తుందన్నారు. గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీడీ కుంపట్ల ఆదిలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు, మహిళా సంరక్షణ ఉద్యోగులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మహాకుంభమేళాలో జనసేన జెండా ప్రదర్శన



అల్లవరం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రంతో ఉన్న జనసేన జెండాను ప్రదర్శించారు. లక్షలాదిగా నాగాసాధువులు, అఘోరీలు పాల్గొన్న ఈమహా కార్యక్రమంలో అల్లవరం జనసేన నాయకుడు కంకిపాటి గోపి జనసేన జెండాను ప్రదర్శించి అందర్నీ ఆకర్షించారు. ఈజెండాను పలువురు ఆసక్తిగా తిలకించారు.

ఉచిత నేత్ర శిబిరం

అంతర్వేది, జనవరి 24(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లిలంకలో మెగా నేత్ర శిబిరాన్ని గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. 365 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 112మందికి కళ్లజోళ్లు, 25 మందికి ఆపరేషన్ల కోసం వేమగిరి పంపించామని గ్లోబల్ ఫౌండేషన్ కన్వీనర్ జంపన బుజ్జిరాజు తెలిపారు. దాట్ల గోపీరాజు, ప్రసాదరాజు, వెంప వర్మ, గోడిలంక లక్ష్మీపతిరాజు, రుద్రరాజు వెంకట్రాజు, రేపూరి ఏసు, కొండా కిశోర్, పండాల శంకర్, ఇందుకురి రవిరాజు, ఆర్.సిద్ధిరాజు పాల్గొన్నారు.

కార్పొరేషన్ డైరెక్టర్ కంకటాలకు ఘన సన్మానం

రాజోలు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): తాటిపాకలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రాష్ట్ర ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు కంచర్ల బాబి ఆధ్వర్యంలో సంఘ సభ్యులు, తాటిపాక ఆర్యవైశ్య వ్యాపార సంఘ సభ్యులు శుక్రవారం రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన కంకటాల రామంను దుశ్శాలువా కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా కార్పొరేషన్ డైరెక్టర్ కంకటాల మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీకి చేసిన సేవలను గుర్తించి ఈపదవిని నాకివ్వడం జరిగిందన్నారు. కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు లభిస్తుందన్నారు. ఆర్యవైశ్యుల కష్టసుఖాల్లో భాగస్వామి అవుతానని పేర్కొన్నారు. కోశాధికారి కంచర్ల కృష్ణమోహన్, ఉపాధ్యక్షుడు పోలిశెట్టి సూరిబాబు, వరదా రమేష్, గాది రామం, మునుకోటి సూరిబాబు, కంకటాల సుమంత్ పాల్గొన్నారు.

మండపేట

కొత్తపేట • మండపేట • రామచంద్రపురం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాయవరం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): రాయవరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ రామచంద్రపురం డీఈఈ కె.రత్నాలరావు తెలిపారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.



ఇప్పనపాడులో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల, ఎంపీపీ తదితరులు

రహదారుల మరమ్మతులకు అధిక ప్రాధాన్యం

తాపేశ్వరం-ఇప్పనపాడు సీసీ రోడ్లు ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, జనవరి, 24(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో గ్రామాలను అభివృద్ధి చేయకుండా వదిలేశారని ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కోట్లాది నిధులలో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణం జరుగుతున్నాయని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. తాపేశ్వరం ఇప్పనపాడు గ్రామాల్లో శుక్రవారం సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. తాపేశ్వరం, ఇప్పనపాడు గ్రామ సర్పంచ్‌లు వాసంశెట్టి రాజేశ్వరి, కుంచే వీరలక్ష్మి, ఎంపీపీ ఉండమట్ల వాసుతో కలిసి ఆయన ప్రారంభించారు. గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పాడి రైతులకు మినీ గోకులాలను ప్రభుత్వం మంజురు చేయగా వాటిని ఆయన ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో ప్రజలు తమ సమస్యలను ఆయనకు తెలిపారు. ఆయన వెంట ఎంపీపీ వాసు, మండల అభివృద్ధి అధికారి సత్యనారాయణ మూర్తి, ఈవో పీఆర్‌డీ దాసరి శ్రీను, మండల ఇంజనీరింగ్ అధికారి నాగేశ్వరరావు, తాపేశ్వరం ఇప్పనపాడు పంచాయతీ కార్యదర్శి శింగంశెట్టి వి.సుబ్బారావు, టీడీపీ, కూటమి నాయకులు నూని వీర్రాజు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

మండపేట, జనవరి 24(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలపై వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మండపేటలో శుక్రవారం రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన రోడ్డు ప్రమాదాలపై రవాణాశాఖ ఆధ్వర్యంలో పెద్దకాల్వ వద్ద ఏర్పాటు చేసిన ఆటో ర్యాలీని ఎమ్మెల్యేతో పాటు కోనసీమ జిల్లా రవాణా అధికారి డి.శ్రీనివాసరావు, మండపేట ఎంవీఐ ఎస్.లక్ష్మీశ్రీదేవి చేతులు మీదుగా ప్రారంభించారు. మండపేట పెద్దకాల్వ వంతెన వద్ద నుంచి కలవపువ్వు సెంటరు వరకు ఆటో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా రవాణాశాఖ అధికారి శ్రీనివాసరావు, ఎంవీఐ లక్ష్మీశ్రీదేవి మాట్లాడారు. కార్యక్రమంలో ఆటో కార్మికులు, పలువురు స్థానిక నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు కూటమి ప్రభుత్వం అండ



సత్యవాడ పశువైద్య శిబిరంలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

కె.గంగవరం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పశుపోషకులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని కార్మికశాఖా మంత్రి వాసంశెట్టి శుభాష్ అన్నారు. శుక్రవారం సత్యవాడ గ్రామంలో పర్యటించిన మంత్రి పశు ఆరోగ్య వైద్య శిబిరాలను ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం పశు పోషకులకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. జనవరి 31 వరకు అన్ని గ్రామాల్లోను పశు ఆరోగ్య శిబిరాలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పశు సంవర్థకశాఖ ఉప సంచాలకులు మూర్తి, సహాయ సంచాలకులు కృష్ణ, ఎంపీపీ పంపన నాగమణి, ఉపసర్పంచ్ సలాది వెంకన్న శ్రీనివాస్, కూటమి నాయకులు తోట వెంకన్న, సలాది రమేష్, తాడాల మాచరరావు, సలాది వెర్రిబాబు, ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

స్వామి వివేకానందను యువత స్ఫూర్తిగా తీసుకోవాలి



వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ ఇస్తున్న శ్రీనివాసచౌదరి

రాయవరం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానందను యువత ఆదర్శంగా తీసుకోవాలని లొల్ల విశ్వమానవతా సంస్థ వ్యవస్థాపకుడు అల్లూరి శ్రీనివాసచౌదరి అన్నారు. శుక్రవారం సంస్థ ఆధ్వర్యంలో రాయవరం వీఎస్‌ఎం కల్యాణం మండపంలో వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ నిర్వహించారు. స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని మానవతా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే మంచి క్రమశిక్షణ అలవర్చుకోవాల న్నారు. కార్యక్రమంలో డాక్టర్ జీఎస్ఎన్ రెడ్డి, యోగా నిపుణుడు వెలగల ఫణికృష్ణారెడ్డి, డాక్టర్ సాయిబాబా, మానవతా ప్రతినిధులు, ఉపాధ్యాయులు, రాయవరం, సోమేశ్వరం, మాచవరం, అనపర్తి మండలం మహేంద్రవాడ గ్రామాల విద్యార్థులు పాల్గొన్నారు.





మండపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో టిడ్కో గృహాలపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

ఎన్నికల హామీకి ప్రభుత్వం కట్టుబడి ఉంది

• ఎమ్మెల్యే వేగుళ్ల • అధికారులను నిలదీసిన నేతలు • వాడివేడిగా మండపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

మండపేట, జనవరి 24(ఆంధ్రజ్యోతి) మండపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శుక్రవారం ఛైర్‌పర్సన్ పి.నూకదుర్గరాణి అధ్యక్షతన జరిగింది. దీనికి హాజరైన ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అజెండాలోని అంశాలపై వాడివేడిగా చర్చ జరిపారు. టిడ్కో గృహాలకు సంబంధించి 136 మంది లబ్ధిదారులకు ఇప్పటివరకు తాళాలు ఇవ్వలేదని టిడ్కో, మున్సిపల్ అధికారులను వారు నిలదీశారు. బ్యాంకు రుణం ఇవ్వకపోవటం వల్ల వారికి తాళాలు ఇవ్వలేదని టిడ్కో అధికారుల సమాధానంపై వారు మండిపడ్డారు. తక్షణమే వారికి ఫేజ్1లో నిలుపుదల చేసిన 136 ఇళ్లను తక్షణమే హ్యాండోవర్ చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. టిడ్కో రుణాలు బ్యాంకు ఇవ్వ కున్నా ప్రభుత్వం వారి రుణాలు, వాయిదాలు బ్యాంకు చెల్లించి తదుపరి లబ్ధిదారుడి నుంచి రికవరీ చేస్తుందని కమిషనర్ టీవీ రంగారావు ఇద్దరు నేతలకు సమాధానం ఇచ్చారు. ఎమ్మెల్సీ త్రిమూర్తులు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు టిడ్కో గృహాల రుణాల రద్దు ఏమైందని ప్రశ్నించారు. దానిపై ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడుతూ ప్రభుత్వం దృష్టికి ఈ విషయాన్ని తీసుకు వెళ్లామన్నారు. సభలో ఎమ్మెల్సీ పలు అంశాలపై అధికారులు నిల దీశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మండపేటలో రూ.17కోట్లు, నియోజకవర్గంలో రూ.70 కోట్లతో ఎస్సీ కాలనీల అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. పట్టణంలో ఎస్సీ కాలనీలోని కమ్యూనిటీ హాలు నిర్మాణం నిలిచిపోయిందని పనులు చేసేందుకు ఎవరూ ముందుకు రావ టం లేదని కౌన్సిలర్ రవి సభ దృష్టికి తీసుకు వచ్చారు. బూరుగుంట చెరువు వద్ద వున్న అన్నపూర్ణాదేవి ఆలయానికి సంబంధించి పన్ను విషయంలో మినహాయింపు ఇవ్వాలని కౌన్సిలర్ కాశిన కాశీవిశ్వనాధం కోరారు. అభివృద్ధి పనులు, సమస్యలపై సమావేశంలో చర్చించారు.

లేని కుళాయి కనెక్షన్ల పన్నులు రద్దు: మండపేటలో గృహాలకు సంబంధించి లేని కుళాయిలకు పన్నుల బకాయిలు రద్దు చేయాలని అజెండాలో పొందుపరచగా దీనిపై చర్యలు తీసుకుంటామని కమిషనర్ రంగారావు తెలిపారు. సమావేశంలో ఇంకా పలు అంశాలపై వాడివేడిగా చర్చలు జరిగాయి. సమావేశంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్‌లు, వేగుళ్ల నారయ్యబాబు, పిల్లి గణేశ్వరరావు, మున్సిపల్ కౌన్సిలర్‌లు, మున్సిపల్ డీఈ శ్రీనివాస్, టీపీవో శ్రీధర్, ఆర్‌ఐ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్ ఆమోదం:

మండపేట మున్సిపల్ బడ్జెట్ 2025-26కు సంబంధించి మున్సిపల్ కమిషనర్ కౌన్సిల్‌లో ప్రవేశపెట్టారు. బడ్జెట్ మొత్తంలో ఆదాయం అంచనా రూ.73.65 కోట్లు, వ్యయం అంచనా రూ.71.79కోట్లు, నిల్వ అం చనా రూ.186 కోట్లుగా చూపించారు. బడ్జెట్‌ను సమావేశంలో ఆమోదించారు.



శివబాలయోగీశ్వరుడికి పూజలు చేస్తున్న మంత్రి సుభాష్

మంత్రి పూజలు

ద్రాక్షారామ, జనవరి 24(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం ఆదివారపుపేట శివబాలయోగీశ్వరుని జయంతిని శుక్రవారం ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా బాలయోగీశ్వరుని సమాధి పూజ, భజనలు చేశారు. మంత్రి సుభాష్ దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో వట్టికూటి వీరవెంకట సుబ్రహ్మణ్యం, కలకొండ రామలింగేశ్వరరావు, వెల్ల మాజీ సర్పంచ్ వట్టికూటి ఏసుబాబు, భక్తులు పాల్గొన్నారు.

దోమల నిర్మూలనకు చర్యలు

మండపేట, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మండపేటలో దోమల నిర్మూలనకు పారిశుధ్య సిబ్బంది చర్యలు చేపట్టారు. ఛైర్‌పర్సన్ పి.నూకరాణి, కమిషనర్ రంగారావు ఆదేశాల మేరకు 30 వార్డుల్లో దోమల నిర్మూలన చేపట్టామని శానిటరీ సూపర్‌వైజర్ ముత్యాల సత్తిరాజు తెలిపారు. దోమల నిర్మూలన చర్యలు నిరంతరం జరుగుతుందని ప్రజలు సహకరించాలన్నారు.



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

వాడపల్లి వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తజనం

ఆత్రేయపురం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కిక్కిరిసింది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్నప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒకరోజు ఆదాయం రూ.2,45,383 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్‌పటేల్ కుటుంబ సమేతంగా స్వామిని దర్శించుకున్నారు. అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితుల ఆశీర్వచనం అందుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. వారికి ఉపకమిషనరు స్వామివారి చిత్రపటం అందించారు.

క్రీడాకారుడికి మంత్రి సుభాష్ ఆర్థికసాయం

కె.గంగవరం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామంలో ఉంటున్న అల్లం రాజేష్ కుమారుడు ప్రియదర్శన్ కార్తీక్ కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమని మంత్రి సుభాష్ అన్నారు. అంతర్జాతీయ స్థాయి పోటీలకు కార్తీక్ ఎంపికైనప్పటికీ ఆర్థిక స్థోమత లేక ఇబ్బందులు పడుతున్నాడన్న విషయం మంత్రి దృష్టికి వచ్చింది దీంతో సత్యవాడ పర్యటనలో ఉన్న ఆయన క్రీడాకారుడిని అభినందించడంతో పాటు 25వేల ఆర్థికసాయం అందించారు. అంతర్జాతీయ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించాలని మంత్రి ఆకాంక్షించారు. సత్యవాడ కూటమి నాయకుడు తోట వెంకన్న రూ.10వేలను క్రీడాకారుడికి అందించారు.



వానపల్లి పళ్లాలమ్మ అమ్మవారు

పళ్లాలమ్మకు లక్ష చామంతి పూజ

కొత్తపేట, జనవరి 24(ఆంధ్రజ్యోతి): వానపల్లి పళ్లాలమ్మ అమ్మవారికి శుక్రవారం భక్తులు లక్షచామంతి పూజ చేశారు. కార్యక్రమంలో సుమారు 253 కుటుంబాలు పాల్గొని కుంకుమ పూజలు చేశారు. బిళ్ళకుర్రు శివారు వాకాడవారిపాలెంకు చెందిన వాకాడ తిరుమలరావు భక్తులకు అన్నప్రసాదాలు ఏర్పాటు చేసినట్టు ఆలయ ఈవో బి.వీరవెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో జీఎస్ భార్గవ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి ఆర్థికసాయం

రామచంద్రపురం(ద్రాక్షారామ), జనవరి 24(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం గొల్లల చెరువు గ్రామానికి చెందిన పేద విద్యార్థిని చదువుకు మంత్రి సుభాష్ రూ10వేల ఆర్థికసాయం అందించారు. శుక్రవారం జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని గొల్లల చెరువు గ్రామానికి చెందిన సూరంపూడి రిషితకు మంత్రి ఆర్థికసాయం చేశారు. సూరంపూడి రిషిత తల్లిదండ్రులు చదువుకు సహకరించక పోవడంతో స్థానికులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీంతో రిషిత చదువు బాధ్యత తీసుకుంటానని, వీఎస్‌ఎం కళాశాలలో హాస్టల్‌లో చేర్పిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చిలుకూరి విశ్వేశ్వరరావు, రవ్వా భూషణం తదితరులు పాల్గొన్నారు.



నర్సిపూడిలో లోకేశ్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కేబుల్ ఆపరేటర్లు

లోకేశ్ చిత్రపటానికి క్షీరాభిషేకం

ఆలమూరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): కేబుల్ ఆపరేటర్ల ఆర్థిక ఇబ్బందులను గుర్తించి కేబుల్ ఆపరేటర్లకు పెనాల్టీలను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్న ఐటీ శాఖా మంత్రి నారా లోకేష్, ఏపీ ఫైబర్ ఛైర్మన్ జీవీ రెడ్డి చిత్రపటాలకు మండల కేబుల్ ఆపరేటర్లు క్షీరాభిషేకం చేశారు. నర్సిపూడిలో కేబుల్ ఆపరేటర్లు యూనియన్ రాష్ట్ర నేత పసలపూడి సీతారామయ్య అధ్వర్యంలో వారి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కేబుల్ ఆపరేటర్లు యూనియన్ నాయకులు మద్దిరెడ్డి మాణిక్యాలరావు, వంటిపల్లి సురేష్, మల్యాల శ్రీశ్రీనివాస్, దియ్యన పెదకాపు, చెల్లుబోయిన నాగేశ్వరరావు, గుత్తుల రాజు తదితరులు పాల్గొన్నారు.



కపిలేశ్వరపురం మండలం మాచరలో ర్యాలీ జరుపుతున్న దృశ్యం



రాయవరం మండలం పసలపూడిలో విద్యార్థినుల మానవహారం

ఘనంగా జాతీయ బాలికల దినోత్సవం

కపిలేశ్వరపురం, జనవరి 24(ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంగర, మాచర జడ్పీ ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. ఐసీడీఎస్, శ్రమ, స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో సర్పంచ్ వాసంశెట్టి సునీత, విష్ణుమూర్తి, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు రాజు, ఎస్.రమాదేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వెంకటలక్ష్మి, మాణిక్యాంబ తదితరులు పాల్గొన్నారు. అనంతరం బాలికలకు క్విజ్ పోటీలు జరపి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో భాగంగా ర్యాలీ జరిపారు. కార్యక్రమాల్లో సచివాలయ, ఉపాధ్యాయ సిబ్బంది, స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



కొత్తపేట వీకేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ రమాదేవి

బాలికలకు బంగారు భవిష్యత్ అందించాలి

రాయవరం: బాలురతో పాటు బాలికలను తల్లిదండ్రులు సమానంగా చూడాలని ఐసీ డీఎస్ మాచవరం సెక్టార్ సూపర్‌వైజర్ విష్ణుకుమారి తెలిపారు. శుక్రవారం పసలపూడి గ్రామ ంలో జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థినిలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య ఆరోగ్య సిబ్బంది గ్రామంలో ర్యాలీ, మానవహారం చేశారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం ఎం.ఆదినారాయణ, ఉపా ధ్యాయురాలు ఎం.వరలక్ష్మి, వైద్య ఆరోగ్య సిబ్బంది పి.శ్రీకాంత్, డి.రేచర్ల, వెల్ఫేర్ అసిస్టెంట్ పి.శ్రీకాంత్, మాచవరం, పసలపూడి, సోమేశ్వరం గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మండపేట: అర్తమూరు ఎస్‌బీజడ్పీ హైస్కూల్లో శుక్రవారం జాతీయ బాలిక దినోత్సవాన్ని పాఠశాల హెచ్‌ఎం శేషారత్నం అధ్యక్షతన జరిగింది. దీనికి గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ ఎస్.వీర్రెడ్డి, పి.సుబ్బారెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో మండపేట రూరల్ ఎస్‌ఐ బుచ్చిబాబు, సర్పంచ్ గోలుగూరి అన్నపూర్ణ, పంచాయతీ కార్యదర్శి అనిల్, పంచాయతీ వార్డు సభ్యులు చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు విద్యావంతులైతే సమాజాభివృద్ధి

కొత్తపేట: మహిళలు విద్యావంతులైతే వారి కుటుంబం తో పాటు సమాజం కూడా అభివృద్ధి చెందుతుందని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రమాదేవి పేర్కొన్నారు. శుక్రవారం కళాశాల ప్రాంగణంలో జాతీయ బాలికల దినోత్సవం ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ డీసీహెచ్ పాపారావు, సీహెచ్ రాణి, కె.సత్యనారాయణ, నాగదీపిక, నాగశ్రీలక్ష్మి, హేమలత, దీపికదేవి, ప్రసన్నజ్యోతి, భవాని, సాయిలక్ష్మి, వల్లి, కావ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌కు సత్కారం

ద్రాక్షారామ, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డ్రైవర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం రామచంద్రపురం మండలం వెంకటాయపాలెంలో ఆర్టీసీ డ్రైవర్‌ను సత్కరించారు. కోటిపల్లి నుంచి కాకినాడ వెళుతున్న ఆర్టీసీ బస్సును ఆపి డ్రైవర్ కాండ్రేగుల శివగణేష్‌ను బీసీ సంక్షేమ సంఘం నాయకుడు రాయుడు చంద్రరావు సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రావణి, కడలి రాంపండు, కడలి ప్రసాద్, నందికోళ్ల మూర్తి పాల్గొన్నారు.

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో డ్రైవర్స్ డే

రావులపాలెం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): రావులపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో డిపో మేనేజర్ రమణ ఆధ్వర్యంలో డ్రైవర్స్ డే జరిపారు. దీనిలో భాగంగా కాంప్లెక్స్ ఆవరణలో డ్రైవర్ల కు పెన్నులు, గులాబి పువ్వులు అందించారు.

పేద కుటుంబానికి ఆర్థికసాయం

ఆలమూరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం సంధిపూడిలో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబానికి జనసైనికులు ఆర్థికసాయం అందించారు. కె.నాగేశ్వరరావు అనే వ్యక్తి మృతి చెందడంలో ఆమె భార్య ఇబ్బందులలో ఉన్నట్లు గుర్తించి జనసైనికులు రూ.27,500 ఆర్థికసాయాన్ని నాగేశ్వరరావు భార్యకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తోట భవానీ, ఎంపీటీసీ తోలేటి సంతోషి పలువురు జనసేన నాయకులు, కర్యకర్తలు పాల్గొన్నారు.

క్రైస్తవుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి

ఆత్రేయపురం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): క్రైస్తవ సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తున్నదని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆత్రేయపురం చినపేటలో కొత్తపేట నియోజకవర్గ క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రథమ వార్షికోత్సవ సమావేశం జరిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ అందరు ఐక్యమత్యంతో ముందుకు నడవాలని కోరారు. అనంతరం జేఏసీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు, ముళ్ళపూడి భాస్కరరావు, కోనాల అంబేడ్కర్, చిక్కాల సత్యప్రసాద్, పాలంగి రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాల్లో మందుల పంపిణీ

కపిలేశ్వరపురం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగర, తాతపూడి గ్రామాల్లో ఆలమూరు పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు ఎల్.అనిత ఆధ్వర్యంలో శుక్రవారం పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. అంగర పశువైద్య శిబిరాన్ని సర్పంచ్ వాసా కోటేశ్వరరావు ప్రారంభించారు. పశువులకు నట్టల నివారణ, గర్భకోశవ్యాధుల చికిత్సలు, మందుల పంపిణీ, కోళ్లకు టీకాలు వేశారు. తాతపూడి పశువైద్య శిబిరంలో చూడి నిర్ధారణ పరీక్షలు, గర్భకోశవ్యాధి పశువులకు ఉచితంగా మందులు అందజేసినట్లు ఆయా గ్రామాల్లో పశువైద్యాధికారులు వీవీ రమణమూర్తి, ప్రసన్న తెలిపారు. అంగరలో 86 గేదెలు, ఆవులు, 50 గొర్రెలకు, తాతపూడిలో 130 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వారు తెలిపారు. కార్యక్రమం లో టీడీపీ అధ్యక్షులు జగ్గంశెట్టి సత్తిబాబు, మేకా శ్రీధర్, నీటి సంఘం డీసీ ఛైర్మన్ మేకా శివప్రసాద్, జనసేన పార్టీ అధ్యక్షుడు గెడ్డం సూర్యభాస్కర్, గ్రామ ఉపసర్పంచ్ గుత్తుల సూర్యనారాయణ, కొప్పిశెట్టి శ్రీను తదితరులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రాయవరం: రాయవరం గ్రామంలో శుక్రవారం పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. పశు సంవర్థకశాఖ రాయవరం ఏడీ అనితకుమారి ఆధ్వర్యంలో పశువులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. డాక్టర్ పి.విజయ్‌కుమార్, నాగ శ్రావణి పాల్గొని సుమారు 90 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. తొలుత ఏడీ, నాయకులు చేతుల మీదుగా వైద్య శిబిరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ నౌడు వెంకటరమణ, సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ టీడీపీ నాయకుడు ఉండవిల్లి రాంబాబు, దేవిశెట్టి కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కె.గంగవరం: కోటిపల్లి గ్రామంలో శుక్రవారం పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పశు వైద్యురాలు డాక్టర్ సంయుక్త లక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పశువులకు నట్టల నివారణ మందులు అందజేయడంతో పాటు 39 పశువులకు మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పెమ్మాడి బేబి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై విద్యార్థులకు క్విజ్ పోటీలు

రావులపాలెం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): రహదారి భద్రతపై విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. రావులపాలెం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఓలేటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానిక సెయింట్ పెట్రిక్స్, చైతన్య, ప్రభుత్వ బాలుర పాఠశాల సిద్ధార్థ, నక్షత్ర పాఠశాలలో విద్యార్థులకు రహదారి భద్రతపై క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను అసిస్టెంట్ ఎంవీఐ షణ్ముఖశ్రీనివాస్ పర్యవేక్షించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, ధృవపత్రాలు అంద చేస్తామని ఎంవీఐ శ్రీనివాస్ తెలిపారు.



క్విజ్ పోటీలను పరిశీలిస్తున్న అసిస్టెంట్ ఎంవీఐ షణ్ముక శ్రీనివాస్

ఉత్సవాల నిర్వహణలో భాగస్వాములు కావాలి

అంతర్వేది, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి వార్షిక కల్యాణ మహోత్సవాల్లో అధికారులందరూ భాగస్వాములై ఉత్సవాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. రాజోలు నియోజకవర్గ, మండల అధికారులతో వరుసగా సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ముందుగా ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో మాట్లాడారు. భక్తులకు తాగునీటి ఇక్కట్లు లేకుండా ట్యాంకర్లను ఏర్పాటు చేయాలన్నారు. అలాగే డీఎల్పీవో, పది గ్రామాల కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఫీల్డు అసిస్టెంట్లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, వచ్చిన ప్రతీ భక్తుడు ఉత్సవ నిర్వహణ కార్యక్రమాల్లో పరిశుభ్రత పాటించేలా దృష్టి సారించాలన్నారు. పుణ్యక్షేత్ర ఆలయాలు, తీర్థ మహోత్సవ ప్రదేశాలు, పరిశుభ్రత ముఖ్యమన్నారు. భక్తులకు మొబైల్ టాయిలెట్లు, స్నానాల రేవులో వసతిగదులు త్వరతిగతిన పూర్తిచేసే బాధ్యత తీసుకోవాలన్నారు. ఉత్సవ సేవా కమిటీ ఛైర్మన్ దిరిశాల బాలాజీ, రాజోలు డిస్ట్రిబ్యూటరీ ఛైర్మన్ గుబ్బల శ్రీను, ఎంపీపీ వి.మల్లిబాబు, ఎంపీటీసీ బి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు భోజనం ప్లేట్లు పంపిణీ

ఆలమూరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఆలమూరు ఖండ్రిగపేటలోని ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు ఆలమూరు కోర్డు ఏజీపీ, ఉమెన్ డెవలప్‌మెంట్ ట్రస్టు ఛైర్‌పర్సన్ బూసి విద్యాప్రసన్న అధ్వర్య ంలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ప్లేట్లు, వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. విద్యార్థుల మధ్యాహ్న భోజనం పథకానికి ప్లేట్లు, వాటర్ బాటిళ్ల కొరత ఉందని గుర్తించి వారికి వీటిని అందిం చారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం అద్దరి శ్రీనివాసరావు, పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ మేడపాటి అరవాలమ్మ, ఉపాధ్యాయులు పిల్లి రాంబాబు, నాయకులు ముప్పిరి వెర్రియ్య, దిడ్డి రాము, నెల్లి చిన్న తదితరులు పాల్గొన్నారు. ఏజీపీ విద్యా ప్రసన్నను పలువురు అభినందించారు.



ఆలమూరులో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు భోజనం ప్లేట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం